# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 307 | శుక్రవారం,మే 29 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు



**న్యూఢిల్లీ, భారత శక్తి** జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతల తర్వాత ఇదే తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణభారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ

2లో..

### ఎన్టీఆర్ కలలను సాకారం చేయడానికి
## కట్టుబడి ఉన్నాం

- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- అణగారిన వర్గాలకు గౌరవం తీసుకురావడమే లక్ష్యంగా పని చేశారని కితాబు
- ఎన్టీఆర్ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ,భారత శక్తి** విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళి అర్పించారు. పేద, అణగారిన వర్గాలకు గౌరవం తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ పని చేశారని కితాబునిచ్చారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం పేదల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని అన్నారు. చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని మోదీ కొనియాడారు. ఎన్టీఆర్ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పేదల కోసం ఎన్టీఆర్ కన్న కలలను సాకారం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# చదువుల పేరిట చైన్ 'దోపిడీ'!



- ▶ నిబంధనలు 'నారాయణ' పాలు.. చట్టాలు 'శ్రీచైతన్య' వశం!
- ▶ అనుమతులు లేవు.. గుర్తింపు లేదు.. కోర్టు ఆదేశాలూ తుంగలోకి!
- ▶ అపార్ట్‌మెంట్లలో మృత్యుగూళ్లు.. ఫైర్ ఎన్‌ఓసీల్లేని క్యాంపస్‌లు.
- ▶ విద్యాశాఖ మంత్రి ,సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!
- ▶ ర్యాంకుల భ్రమలతో సామాన్యుడి జేబుకు చిల్లులు.. విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లుండటమే కారణమా?
- ▶ ఫోరం ఫర్ యాంటీకరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ అందిస్తున్న పరిశోధనాత్మక కథనం..!

**తెలంగాణలో కార్పొరేట్ విద్యా సంస్థల చైన్ 'దోపిడీ' అరాచక పరాకాష్టకు చేరింది. పవిత్రమైన విద్యను వ్యాపార సరుకుగా మార్చి, నిబంధనలను నారాయణ పాలు, చట్టాలను శ్రీచైతన్య వశం చేస్తూ సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి అనుమతులు లేని 'మృత్యుగూళ్ల' వంటి అపార్ట్‌మెంట్లలో ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా వేలాది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ర్యాంకుల భ్రమలు, కృత్రిమ సీట్ల కొరతతో లక్షల ఫీజులు లూటీ చేస్తూ, లెక్చరర్ల శ్రమను దోచుకుంటున్నారు. విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే ఈ మాఫియా విస్తరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ తక్షణమే ఉక్కుపాదం మోపి, ఫీజు నియంత్రణ చట్టాన్ని తెచ్చి ఈ విద్యా అరాచక సామ్రాజ్యాన్ని ప్రక్షాళన చేయాలి.**

**హైదరాబాద్: మే 28 భారత శక్తి** తెలంగాణలో విద్యా రంగం కార్పొరేట్ వ్యాపార శక్తుల గుప్పిట్లో నలిగిపోతోంది. పవిత్రమైన విద్యా సేవ ముసుగులో నారాయణ, శ్రీ చైతన్య, ఎస్ ఆర్, గాయత్రి వంటి చైన్ విద్యా సంస్థలు సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రుల రక్తాన్ని పిండేస్తున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న ఈ విద్యా వ్యాపార ధోరణిపై విద్యాశాఖ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ప్రభుత్వ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ, చట్టాల లొసుగులతో సాగుతున్న ఈ విద్యా దోపిడీపై "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్" సంస్థ జరిపిన క్షేత్రస్థాయి పరిశోధనలో దిగ్భ్రాంతికర నిజాలు వెలుగుచూశాయి.




### హైకోర్టు హెచ్చరించినా మొండివైఖరే!


తెలంగాణ విద్యా చట్టం (1982)తో పాటు ఇంటర్మీడియట్ విద్యా మండలి నిబంధనలను ఈ కార్పొరేట్ సంస్థలు పూర్తిగా

2లో..

### ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన
## సీఎం రేవంత్ రెడ్డి

**కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు**

- అమీర్‌పేట మైత్రివనం వద్ద విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, నందమూరి కుటుంబ సభ్యులు, మంచు మనోజ్
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ భారత శక్తి** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

### సనత్‌నగర్ 'టిమ్స్' ప్రారంభానికి
## చకచకా ఏర్పాట్లు!

- **అంతర్జాతీయ స్థాయి వైద్య సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **సివిల్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశం..**
- **వైద్యులకు వసతి గృహాలు, బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాలు.**




**హైదరాబాద్, మే 28: భారత శక్తి,** రాజధాని నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతున్న సనత్‌నగర్ 'టిమ్స్' (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఆసుపత్రిలో కల్పిస్తున్న అత్యాధునిక వైద్య సదుపాయాలు, మౌలిక వసతులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను కలియతిరిగిన ఆయన, నిర్మాణ పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### అంతర్జాతీయ ప్రయోగశాలపై ప్రత్యేక కమిటీ

ఆసుపత్రిలో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ స్థాయి వైద్య ప్రయోగశాల (లాబరేటరీ) నిర్వహణపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. దీని ఏర్పాటుకు సంబంధించి వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), విభాగాధిపతులు (హెచ్‌ఓడీ), తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు

2లో..

# ఫ్యూచర్ సిటీలో భూముల 'ధర'హాసం!





- రావిర్యాలలో గజం రూ. 83,500.. హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్
- నాలుగు ప్లాట్ల వేలంతో ప్రభుత్వానికి రూ. 140 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, మే 29 భారత శక్తి:** రాజధాని పరిధిలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మళ్లీ పుంజుకుంది. పెద్దపెద్ద వెంచర్లు చేపట్టేందుకు అనువైన క్లియర్ టైటిల్ భూములకు మార్కెట్‌లో భారీ డిమాండ్ పలుకుతోంది. ముఖ్యంగా వివాదాలు లేని ప్రభుత్వ హౌసింగ్ బోర్డు స్థలాలను దక్కించుకునేందుకు కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, ఫ్యూచర్ సిటీ ప్రవేశ ద్వారం (ఎంట్రన్స్) వద్ద, శంషాబాద్ విమానాశ్రయానికి (ఎయిర్‌పోర్ట్) సమీపంలో

2లో..

### రేవంత్ ప్రభుత్వ పాలసీలు
## తుగ్లక్ పాలసీలు

**- ఎంపి ఈటల రాజేందర్.**



**నిర్మల్‌భారత శక్తి** రైతు గోస బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ లో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బీజేఎల్పీ లీడర్ మహేష్ రెడ్డి ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు రైతులతో మాట్లాడారు.ఇరవై రోజుల నుండి పట్టించుకోలేదు. ఈరోజు హడావుడిగా తరలిస్తున్నారు. ఒక్క క్వింటాకు 80 రూపాయల నుండి 100 రూపాయలు మేమే ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది.. హమాలికి 50 రూపాయలు, లారీకి 30 రూపాయలు ఇస్తేనే సంచులు తీసుకుపోతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే మంత్రి మమ్ముల్ని పట్టించుకున్న పాపాన పోలేదు అని రైతులు బీజేపీ నేతలకు వివరించారు. బీజేపీ వారు డ్రామా చేస్తున్నారని మంత్రులు విమర్శిస్తున్నారు కదా అని రైతుల వద్ద ప్రస్తావించిన ఈటల రాజేందర్..

2లో..

### సంస్కృతుల వారధి
## 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'

- ఈశాన్య రాష్ట్రాలతో పెరిగిన బంధం: గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- లోక్‌భవన్‌లో ఐఐఎం షిల్లాంగ్ విద్యార్థుల సందడి.



**హైదరాబాద్: మే 28 భారత శక్తి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం రాష్ట్రాల మధ్య సాంస్కృతిక మార్పిడికి అద్భుతమైన వేదికగా నిలుస్తోందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈశాన్య రాష్ట్రాలతో ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ (రవాణా, సాంస్కృతిక అనుసంధానం) పెరిగిందని, తద్వారా ఈశాన్య రాష్ట్రాలు మిగతా భారతావనికి సాంస్కృతికంగా మరింత చేరువయ్యాయని ఆయన పేర్కొన్నారు.కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ -- యువ సంగమ్' (ఆరో విడత) కార్యక్రమంలో భాగంగా మేఘాలయ రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) షిల్లాంగ్‌కు చెందిన 50 మంది విద్యార్థులు గురువారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

### ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది: పవన్ కల్యాణ్



**అమరావతి భారత శక్తి** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత

2లో..

## సీఎం పదవికి రాజీనామా చేశాను

**- సిద్ధరామయ్య భావోద్వేగ ప్రకటన**



**కర్ణాటకభారత శక్తి** కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు సిద్ధరామయ్య స్వయంగా వెల్లడించారు. అనంతరం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా

2లో..

# చదువుల పేరిట చైన్ 'దోపిడీ'!





పక్కనబెట్టేశాయని ఫోరం నివేదిక స్పష్టం చేస్తోంది. ముందస్తు అనుమతులు, కనీస అనుబంధ గుర్తింపు లేని వందలాది అక్రమ క్యాంపస్‌లను నిస్సిగ్గుగా నడుపుతున్నారు. 68 జూనియర్ కళాశాలలను మూసేయమన్నా..: బోర్డు అనుమతి లేకుండా అక్రమంగా అడ్మిషన్లు సాగిస్తున్న నారాయణ, శ్రీ చైతన్య సంస్థలకు చెందిన 68 జూనియర్ కళాశాలలను తక్షణమే మూసివేయాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఒక ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా ఆదేశించింది. ఇంతటి తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడినా, నేటికీ క్షేత్రస్థాయిలో అదే ధోరణి కొనసాగుతుండటం గమనార్హం. మరోవైపు విద్యా క్యాలెండర్‌ను ఈ సంస్థలు తమ వ్యాపార ప్రణాళికగా మార్చేశాయి. వేసవి సెలవుల నిబంధనలకు విరుద్ధంగా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే "సమ్మర్ క్యాంప్"ల పేరిట తరగతులు మొదలుపెట్టి విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారు. గతంలో శ్రీ చైతన్యకు 1.40 కోట్లు, నారాయణకు ?62 లక్షల భారీ జరిమానాలు విధించినా, వస్తున్న లాభాల ముందు ఈ జరిమానాలు వాటికి లెక్కలేకుండా పోయాయి.

### ప్రకటనల మాయాజాలం.. లూటీల పర్వం:

తల్లిదండ్రుల బలహీనతలను, పిల్లల భవిష్యత్తుపై ఉన్న ఆశలను ఈ సంస్థలు పెట్టుబడిగా మార్చుకుంటున్నాయి. కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలనే నిబంధన ఉన్నా, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ప్రత్యేక శిక్షణ, ఏసీ తరగతి గదుల పేరిట వార్షిక ఫీజులను లక్షల్లో గుంజుతున్నారు. కృత్రిమ కొరత – ముందస్తు లూటీ: నవంబర్, డిసెంబర్ నెలల నుంచే "సీట్లు అయిపోతున్నాయి" అంటూ కృత్రిమ కొరతను సృష్టించి అడ్వాన్సులు వసూలు చేస్తారు. ఆ తర్వాత ఒకవేళ సీటు రద్దు చేసుకుంటే పైసా వెనక్కి ఇవ్వరు. అంతర్గత ఏకఛత్రాధిపత్యం: పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, బెల్టులు, బూట్లు వంటి ప్రతీ వస్తువును మార్కెట్ ధర కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ ధరకు తమ క్యాంపస్‌లలోనే కొనాలనే నిబంధన విధిస్తారు. ర్యాంకుల కొనుగోలు చదరంగం: రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రథమ ర్యాంకులు అంటూ ఒకే విద్యార్థి ఫోటో నాలుగైదు సంస్థల ప్రకటనల్లో కనిపిస్తుంది. ప్రతిభ గల విద్యార్థులను ముందే కొనుగోలు చేసి, తమకే ర్యాంకులు వచ్చాయంటూ సామాన్యులను భ్రమల్లో ముంచుతున్నారు.

### అపార్ట్‌మెంట్లలో 'మృత్యు గూళ్లు'.. ఫైర్ సేఫ్టీ శూన్యం:

ఈ కార్పొరేట్ సంస్థల క్యాంపస్‌లలో మెజారిటీ భాగం ఇరుకైన అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలలోనే నడుస్తున్నాయని ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధారాలతో సహా నిరూపించింది. వీటిలో కనీస గాలి, వెలుతురు ఉండవు. అత్యంత ప్రమాదకరమైన విషయం ఏంటంటే, వీటికి కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాల పత్రం (ఫైర్.ఎన్.సి) కూడా లేదు. విపత్తు నిర్వహణ శాఖ నిబంధనలను తుంగలో తొక్కి, వేలాది మంది విద్యార్థులను ఒకేచోట గొర్రెల మందల్లా కుక్కుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు గాల్లో కలవాల్సిందేనా అని తల్లిదండ్రులు వణికిపోతున్నారు.

### లెక్చరర్ల శ్రమ దోపిడీ.. పన్నుల ఎగవేత

లాభాపేక్ష లేని సంస్థల (నాట్ ఫర్ ప్రాఫిట్) పేరిట రిజిస్ట్రేషన్లు చేయించుకుని, ప్రభుత్వం నుండి భూములు, పన్ను మినహాయింపులు పొందుతూ.. లోపల మాత్రం వందల కోట్ల వ్యాపారం సాగిస్తున్నారు. ఇది వ్యవస్థీకృత పన్ను ఎగవేత దందాయేనని విమర్శలు వస్తున్నాయి. ఇక వీరి వద్ద పనిచేసే ప్రైవేట్ లెక్చరర్లు, ఉపాధ్యాయుల పరిస్థితి దారుణంగా ఉంది. రోజుకు 12 నుండి 14 గంటలు పనిచేయించుకుంటూ, శ్రమకు తగ్గ కనీస వేతనాలు ఇవ్వడం లేదు. భవిష్య నిధి (పిఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) వంటి ప్రాథమిక హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలు లాభాలను మూటగట్టుకుంటున్నాయి.

### ర్యాంకుల యంత్రాలు: బలిపీఠాలపై విద్యార్థుల ప్రాణాలు!

శాస్త్రీయమైన విద్యా విధానం ఎప్పుడూ విద్యార్థి మానసిక వికాసానికి తోడ్పడాలి. కానీ, ఈ చైన్ సంస్థలలో ఆట స్థలాలు ఉండవు, శారీరక శ్రమకు తావుండదు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు కారాగారాల వంటి గదుల్లో బంధిస్తున్నారు. మార్కుల ఆధారంగా 'సెక్షన్ల' విభజనలు చేస్తూ, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఈ అశాస్త్రీయ, అమానవీయ పోకడల వల్లే ప్రతి ఏటా తెలంగాణలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు బలవుతున్నారు. కార్పొరేట్ యాజమాన్యాల ఒత్తిడి కారణంగా జరుగుతున్న ఈ మరణాలు ముమ్మాటికీ వ్యవస్థీకృత హత్యలేనని మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.



### ప్రభుత్వం తక్షణమే ప్రక్షాళన చేపట్టా

గత పాలకుల ఉదాసీనత, విద్యాశాఖ అధికారుల అలసత్వం వల్లే ఈ విద్యా మాఫియా ఇంతలా విస్తరించిందని ఫోరం తన నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ఈ వ్యవహారంపై తక్షణమే ఉక్కుపాదం మోపాలని విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఫీజు నియంత్రణ కమిటీ (ఎఫ్.ఆర్.సి): ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ సిఫార్సులను దుమ్ము దులిపి, ప్రైవేట్ ఫీజుల నియంత్రణకు తక్షణమే చట్టాన్ని అమలు చేయాలి.

**కఠిన చర్యలు:** నిబంధనలు ఉల్లంఘించి, అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రతీ అక్రమ బ్రాంచ్‌ను సీజ్ చేయాలి.

**క్రిమినల్ కేసులు:** విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ, ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

విద్యా వ్యాపార సామ్రాజ్యాల అక్రమాలకు అడ్డుకట్ట వేసి, సామాన్యుడికి 'విద్యా హక్కు'ను కాపాడాలని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో కోరుతోంది.

## సనత్‌నగర్ 'టిమ్స్' ప్రారంభానికి
# చకచకా ఏర్పాట్లు!



అవసరమైన తదుపరి పనుల అంచనాలను తక్షణమే నివేదించాలన్నారు.

### రోగుల సహాయకులకు ధర్మశాల.. విదేశీయులకు ప్రత్యేక వసతులు

వైద్యం కోసం వచ్చే అంతర్గత, బాహ్య రోగులకు (ఇన్‌పేషంట్, ఔట్‌పేషంట్) ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినన్ని శౌచాలయ సముదాయాలను నిర్మించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం ప్రత్యేకంగా ఒక 'ధర్మశాల'ను, ఆసుపత్రి ఆవరణలో రెండు సువిశాలమైన ఉపాహార శాలలను (క్యాంటీన్లు) ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విదేశాల నుంచి వచ్చే రోగుల కోసం కేటాయించిన ప్రత్యేక విభాగాల్లో అత్యంత ఆధునిక సదుపాయాలకు పెద్దపీట వేయాలన్నారు. ఆసుపత్రి లోపలి అలంకరణ (ఇంటీరియర్), విశ్రాంతి గదులు (లాంజ్‌లు) నయనానందకరంగా ఉండాలని సూచించారు.

### ట్రాఫిక్ చిక్కుల్లేకుండా 'మల్టీ లెవెల్ పార్కింగ్'

ఆసుపత్రి ప్రాంగణంలో వాహనాల రద్దీ పెరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు బహుళ అంతస్తుల పార్కింగ్ (మల్టీ లెవెల్ పార్కింగ్) విధానాన్ని అభివృద్ధి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. వైద్య విద్యార్థులు, వైద్యుల కోసం ఆసుపత్రి ఆవరణలోనే బాలుర, బాలికలకు విడివిడిగా వసతి గృహ (హాస్టల్) భవనాలను నిర్మించాలన్నారు. వీటితో పాటు పరిపాలన భవనం, క్షయ నివారణ ఆసుపత్రి బోర్డు (టీబీ హాస్పిటల్ బోర్డు) కార్యాలయ పనులను త్వరితగతిన ముగించాలని చెప్పారు. భద్రత దృష్ట్యా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఒక పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### నిరంతర సేవలే లక్ష్యం: అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ప్రతిపాదిత పరిపాలన భవనంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ, నిరంతర నీటి సరఫరా వంటి అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగేలా పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

### సమీక్షలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ ఉన్నత స్థాయి పర్యటనలో వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హనుమంతు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, రహదారులు-భవనాల (ఆర్ అండ్ బి) శాఖ ఇంజనీరింగ్ అధికారి రాజేశ్వర్ రెడ్డి మరియు ఇతర ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ ప్రభుత్వ పాలసీలు తుగ్లక్ పాలసీలు

దానికి రైతులు స్పందిస్తూ.. సీఎం మంత్రులకు "పుట్ బాల్" ఆట మీద ఉన్న ఆసక్తి రైతుల మీద, ధాన్యం కొనుగోళ్ల మీద లేదని రైతులు అన్నారు. కేంద్రం డబ్బులు ఇస్తున్నా వీరు మాత్రం కొనుగోళ్లు చేయలేక పోతున్నారు. మేమందరం మార్పు కోసం ఓటు వేసి సీఎంను మంత్రులను చేస్తే వీరు మాత్రం మమ్ముల్ని పట్టించుకోవడంలేదని సత్యనారాయణ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొక్కలు పడ్డ సంచులు ఇచ్చారు. పండిన ధాన్యం మొత్తం కొనడం లేదు. కొన్ని సెంటర్స్ లో అసలు కొనుగోళ్లకోసం ఏర్పాట్లు కూడా చేయలేదనీ బీజేపీ నేతల బృందంకు రైతులు తెలియజేసారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతన్న మీద పగబట్టి ఇంత మోసం చేస్తారని కలలో కూడా ఊహించలేదు. నాలుగు రోజుల నుంచి మేము తిరుగుతున్నాము ఎక్కడికి వెళ్లినా ఒకటే వేదన ఒకటే దుఃఖం ఇంత శిక్ష ఈ ప్రభుత్వం ఆ మీద ఎందుకు వేస్తుందని రైతులు ఏడుస్తున్నారు. – మీరు వస్తున్నారని తెలియగానే బస్తాలు వస్తున్నాయి లారీలు వస్తున్నాయి.. మీరు తిరుగుతుంటే మాకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. వరి ధాన్యం మక్కలు తెల్ల జొన్నలు గోదాములకు చేరుకునేంతవరకు మీ యాత్ర ఆపవద్దు అని కోరుతున్నారు. – కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మూర్ఖంగా అనాలోచితంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని ఊహించలేదు. తెల్ల జొన్నలు ఎకరానికి 30 క్వింటాలు దిగుబడి వస్తే 10 క్వింటాలు మాత్రమే కొంటామని ప్రభుత్వం చెప్తుంది ఈ ప్రభుత్వానికి బుద్ధి జ్ఞానం ఉందా అని రైతులు అడుగుతున్నారని అన్నారు. అసలు వ్యవసాయ పట్ల వీరికి అవగాహన ఉందా అని ప్రశ్నిస్తున్నారు. – మొక్కజొన్నలు 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుంటే ఇరవై ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొంటామని ప్రభుత్వం ప్రకటిస్తే మిగిలిన మక్కలు ఎక్కడ అమ్ముకోవాలి. సన్ ఫ్లవర్ 5 వేలకు కొనే దిక్కులేదు.. నూనె గింజలు పండించండి అనే ప్రకటించావు కదా ఎందుకు కొనడం లేదని ప్రశ్నిస్తున్నాను. – బిడ్డా ఇదేనా నీ రైతు భరోసా.. – ఇదేనా నీ రైతు పాలసీ. కౌలు రైతులకు మార్కెట్ లో ధాన్యం అమ్ముకోవడానికి వీలు లేదు. భూమి యజమాని వచ్చి థంబ్ పెట్టాలి అంటున్నారు. ముంబైలో, దుబాయిలో, హైదరాబాద్ లో ఉన్న రైతు ఎలా వస్తాడు అనే సోయి ఈ ప్రభుత్వానికి ఉందా అని నేను అడుగుతున్నా. – నీ పాలసీలు తుగ్లక్ పాలసీలగా ఉన్నాయి. మెదడు లేని పాలసీలుగా ఉన్నాయి. ఇలాంటి పద్ధతులన్నీ పక్కనపెట్టి పండించిన ప్రతి గింజ కొంటానని ఇచ్చిన మాట ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. 2034 వరకు ఉంటానని అనుకుంటున్నావా బాబు.. నీకు కాలం దగ్గర పడిందని అన్నారు. దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేయి ఎన్నికలకు రా నీ సంగతి ఏందో తెలుస్తుంది. – ఆ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి తొమ్మిదిన్నర ఇల్లు పట్టింది కానీ నీ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి మూడేళ్లలోనే తేలిందని రైతులు అంటున్నారు. – ఎంత పంట దిగుబడి వస్తుందని అంచనాలు లేవా ఆ మాత్రం బుద్ధి జ్ఞానం లేకుండా పనిచేస్తున్నారా. అంచనాలకు అనుగుణంగా బస్తాలు, హమాలీలు, లారీలు, గోదాములు ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోయారు. – మేము రైతులకు భరోసా కల్పించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి వస్తే రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు బిడ్డ రా ఇక్కడికి తెలుసుకుందాం – నీకు రైతుల దగ్గరికి వచ్చే ముఖం దమ్ము లేదు. – ప్రెస్ మీట్ లు మా మీద పెట్టడం కాదు బిడ్డ.. రైతుల దగ్గరికి వచ్చి మాట్లాడండి. రైతులను ఆదుకునే ప్రయత్నం చేయండి తప్ప ఎదురు దాడి మంచిది కాదు. – రైతులారా గమనించండి ఇలాంటి దద్దమ్మలను ఎన్నుకొని మనం బాధపడుతున్నాము. చివరి గింజ కొనే వరకు రైతులకు మేము అండగా ఉంటామని అన్నారు. ఈ యాత్రలో బీజేపీ శాసనసభ పక్ష నాయకులు మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, హరీష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి.. ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య అంజిరెడ్డి, జీలని రెడ్డి స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం పదవికి రాజీనామా చేశాను

సిద్ధరామయ్య కొంత భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు.

తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు.

తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

## నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు. నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ కొత్త అధ్యక్షులు త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇతర కేంద్ర నాయకులతో సమావేశం కానున్నారు. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

## సంస్కృతుల వారధి 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'



### జాతీయ సమగ్రతకు యువతే కీలకం

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలోని విభిన్న రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానాలపై పరస్పర అవగాహన పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. యువత దేశ సమైక్యతను, జాతీయ సమగ్రతను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ చరిత్ర, విశిష్ట సంస్కృతి, ఇక్కడి అభివృద్ధి విశేషాలను అధికారులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, వరంగల్ నిట్ (చీఖ) ప్రొఫెసర్లు కిరణ్ కుమార్, సునీల్ కుమార్, కో-నోడల్ అధికారి ప్రొఫెసర్ పెరుగు శ్యామ్, నోడల్ అధికారి ప్రొఫెసర్ హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో భూముల 'ధర'హాసం!

ఉన్న రావిర్యాల భూములకు గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలం (ఇ-ఆక్షన్)లో రికార్డు ధరలు పలికాయి.

ఇక్కడ ఉన్న నాలుగు ల్యాండ్ పార్సిళ్లకు (భూములకు) నిర్వహించిన వేలంలో చదరపు గజం ధర గరిష్టంగా రూ. 83,500 పలికినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు ప్లాట్ల విక్రయం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 140 కోట్ల ఆదాయం సమకూరిందని ఆయన వివరించారు.

### గజం కనీస ధర రూ. 26 వేలు.. పలికింది రూ. 83,500!

?ఈ భూముల విక్రయానికి సంబంధించి హౌసింగ్ బోర్డు గత నెలలోనే నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఈ స్థలాలను దక్కించుకునేందుకు దాదాపు 17 ప్రముఖ నిర్మాణ సంస్థలు, డెవలపర్లు పోటీ పడ్డారు. ముఖ్యంగా 1,113 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీనికి అధికారులు కనీస ధరగా (అప్‌సెట్ ప్రైస్) గజానికి రూ. 26,000 నిర్ణయించగా.. వేలంలో ఏకంగా రూ. 83,500 పలుకుతూ ఒక డెవలపర్ సంస్థ దీనిని దక్కించుకుంది.

అలాగే, ఇదే ప్రాంతంలోని దాదాపు 6,000 చదరపు గజాల విస్తీర్ణం గల మరో ప్లాట్ గజానికి రూ. 62,500 చొప్పున అమ్ముడుపోయింది. మరో 13,500 చదరపు గజాల పెద్ద ప్లాట్‌ను దక్కించుకునేందుకు సైతం బిడ్డర్లు భారీగా పోటీ పడ్డారు. మొత్తంగా ఈ నాలుగు ప్లాట్ల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ. 140 కోట్ల మేర భారీ ఆదాయం లభించింది.

### నేడు కేపీహెచ్‌బీ, చింతల్ భూములకు వేలం

రావిర్యాల వేలం విజయవంతం కావడంతో శుక్రవారం మరికొన్ని కీలక ప్రాంతాల్లోని స్థలాలను వేలం వేసేందుకు హౌసింగ్ బోర్డు సిద్ధమైంది.

కేపీహెచ్‌బీ కాలనీతో పాటు కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్ ప్రాంతాల్లో ఉన్న మరో నాలుగు ప్లాట్లకు శుక్రవారం ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్ 1-2 లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్ నంబర్ 2తో పాటు.. కుత్బుల్లాపూర్ చింతల్ పరిధిలోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను ఈ వేలంలో విక్రయించనున్నారు. ఐటీ కారిడార్‌కు, నగరానికి కీలకమైన ఈ ప్రాంతాల్లోని స్థలాలకు కూడా భారీగా ధరలు పలికే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది: పవన్ కల్యాణ్

రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు.

పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి VOICE OF INDIAN

## ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు యుద్ధ తంత్రం..!

పశ్చిమాసియాలో త్వరలోనే శాంతి నెలకొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి శుభవార్త చెప్పారు. ఇరాన్ కూడా యురేనియం వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ఇక అంతా మంచే జరుగుతుందని భావిస్తున్న వేళ అమెరికా ఆత్మరక్షణ పేరుతో ఇరాన్‌పై భీకర దాడులు మొదలు పెట్టింది. మరోమారు తన సైనిక బలాన్ని ప్రదర్శించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల్లోని బందర్ అబ్బాస్, క్వెష్మ్ పోర్టు సమీపంలోని సైనిక స్థావరాలు, క్షిపణి లాంచ్ ప్యాడ్లు, సముద్రంలో మైన్లు (మందుపాతరలు) పరచే బోట్లు, నేవీ బేస్‌లపై తీవ్ర దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతీ హాకిన్స్ ఈ దాడులను "ఆత్మరక్షణ చర్య"గా సమర్థించారు. ఇరాన్ తీరం వెంట ఉన్న క్షిపణి స్థావరాలు తమ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలకు నేరుగా ముప్పు కలిగించాయని, మందుపాతరలు పరచడానికి ప్రయత్నించే బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు మరణించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు కొన్ని వార్తా వర్గాలు పేర్కొన్నాయి.ప్రపంచ ఇంధన మార్గాల్లో ఆక్సిజన్‌గా భావించే హార్ముజ్ జలసంధి దాదాపు మూడు నెలలుగా స్తబ్దంగా మారింది. అమెరికా?ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈ కీలకమైన నౌకా మార్గాన్ని అడ్డుకోవడంతో, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి 1967 సూయజ్ కాలువ సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది.1967 అరబ్?ఇజ్రాయెల్ యుద్ధంలో సూయజ్ కాలువలో 15 నౌకలు చిక్కుకుపోయి, ఎనిమిదేళ్లపాటు అక్కడే కూరుకుపోయాయి. 'ఎల్లో ఫ్లీట్'గా ప్రసిద్ధి చెందిన ఆ నౌకలు తుప్పు పట్టి, చరిత్రలో ఒక హెచ్చరికగా మిగిలిపోయాయి. ఇప్పుడు హార్ముజ్‌లోనూ అదే దృశ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులు ఈ దిగ్బంధనం కొనసాగుతుందో, ఎన్ని ఓడలు ఈ జలసంధిలో నిలిచిపోతాయో ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ సంక్షోభం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించినా, వాస్తవం మాత్రం తీవ్రంగా ఉంది.సంక్షోభం ప్రారంభం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్పష్టమైన దూరదృష్టితో ముందుకు వెళ్తోంది. హార్ముజ్‌పై ఆధారపడకుండా చమురు రవాణా చేసేందుకు ప్రత్యామ్నాయ పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావొచ్చని అంచనాలు ఉన్నాయి. దౌత్య చర్చలు జరుగుతున్నా, దీర్ఘకాలిక ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని అబుదాబి అంచనా వేస్తోంది. ఇది ఒక దేశం మాత్రమే కాదు, మొత్తం గల్ఫ్ ప్రాంతం యొక్క భద్రతా వ్యూహంలో భాగం.సంక్షోభం త్వరలో ముగిసి, చమురు ధరలు అనియంత్రితంగా పెరగకుండా సమతుల్యత నిలుస్తుందని వారు నమ్ముతున్నారు. అయితే ఈ ఆశలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చేయనేది ప్రశ్నార్థకం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు సరఫరా అంతరాయం కలిగింది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిల్వలు విడుదల చేయడం ద్వారా తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రించగలిగాయి. కానీ ఈ నిల్వలు ఎప్పటికప్పుడు అయిపోతాయి.ఇరాన్ సంకల్పం. ఆర్థిక ఒత్తిడిఇరాన్ వైపు చూస్తే, తీవ్రమైన ఆర్థిక సవాళ్ల మధ్య కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, ఉనికి కోసం పోరాటం కొనసాగుతోంది. రెండు వైపులా 'ముందుగా ఎవరు ఒప్పుకుంటారు' అని వేచి చూడడం జరుగుతోంది. ఇలాంటి స్థిరత్వం లేని ఎదురు చూపు ప్రపంచానికి మరింత నష్టం కలిగిస్తుంది. హార్ముజ్‌ను శాశ్వతంగా మూసివేయడం ఎవరికీ లాభదాయకం కాదు. త్వరిత తాత్కాలిక ఒప్పందం అవసరం. అయితే గత చరిత్ర చెప్పినట్లు, ఒక్కసారి సాధారణమైన సంక్షోభాలు కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఇంధన భద్రత ఇకపై భౌగోళిక రాజకీయాలపై ఆధారపడి ఉండదు. వైవిధ్యపరమైన సరఫరా మార్గాలు, పునరుత్పాదక ఇంధనాల వైపు వేగవంతమైన మార్పు, ప్రాంతీయ దేశాల మధ్య సహకారం ? ఇవి భవిష్యత్ కోసం అనివార్యమైన అడుగులు.చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, ఆర్థిక వ్యవస్థలు మాత్రమే కాదు, సమగ్ర ప్రపంచ స్థిరత్వం కూడా ప్రమాదంలో పడుతుంది. సమయం ఇంకా ఉంది, కానీ చాలా తక్కువగా ఉంది.ఏప్రిల్ 7న ప్రకటించిన సీజ్‌ఫైర్ అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇది ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరిక. దోహాలో జరుగుతున్న కీలక దౌత్య ప్రయత్నాలుదాడులు జరుగుతున్న అదే సమయంలో ఖతార్ రాజధాని దోహాలో ఇరాన్?అమెరికా దూతల మధ్య కీలక చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం ఈ సంప్రదింపుల్లో పాల్గొంటోంది. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు, అయితే ఇంకా కొన్ని కీలక సమస్యలు మిగిలి ఉన్నాయని తెలిపారు.ఇరాన్ ప్రధాన దృష్టి యుద్ధ ముగింపు (లెబనాన్‌తో సహా) వైపే ఉందని, ప్రస్తుతం అణు అంశాలను చర్చించడం లేదని స్పష్టం చేశారు.యుద్ధం పూర్తిగా ముగిస్తే 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత చర్చలు ప్రారంభించవచ్చని సంకేతాలిచ్చారు. ఖతార్ మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కీలకమవుతోంది. లెబనాన్‌పైనా దాడులు జరగకుండా ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది.ఈ తరుణంలో అమెరికా 33 మిసైల్ సైట్లలో దాదాపు 30ను తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 70 శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించింది. ఇది ఇరాన్ ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇప్పటికీ కాపాడుకోవాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు అమెరికా దాడులు ఇరాన్‌ను మరింత ఒత్తిడికి గురి చేసి చర్చల టేబుల్ వద్ద రాజీకి సిద్ధం చేయడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. ఈ ద్వంద్వ వ్యూహం (దాడి + దౌత్యం) మధ్యప్రాచ్య రాజకీయాల సారాంశాన్ని బయటపెడుతోంది. స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమ నియంత్రణ, ప్రాంతీయ స్థిరత్వం ? ఇవన్నీ అమెరికా స్ట్రాటజిక్ లక్ష్యాలు. ఇరాన్ మాత్రం ఆర్థిక ఒత్తిడి, సైనిక నష్టాల నుంచి బయటపడి తన ప్రాంతీయ ప్రభావాన్ని కాపాడుకోవాలని చూస్తోంది.ఈ చర్చలు విజయవంతమైతే మధ్యప్రాచ్యంలో కొత్త శాంతి అధ్యాయం మొదలవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు సాఫీగా జరగడం, ఆర్థిక ఉక్కిరిబిక్కిరి తగ్గడం, ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గడం వంటి సానుకూల ఫలితాలు వస్తాయి. కానీ ఒప్పందం కుదరకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగి పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు వైపులా "ఒప్పందం కావాలి" అన్న కోరిక కనిపిస్తోంది. అయితే షరతులు, అణు అంశాలు, సైనిక నియంత్రణ వంటి విషయాల్లో ఇంకా తీవ్ర అసమ్మతి నెలకొని ఉంది.దోహా చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. మధ్యప్రాచ్య శాంతి ఎప్పుడూ సులభం కాదు. బాంబులు పడుతున్నప్పుడే దౌత్యం నడుస్తున్న ఈ ఆటలో ఏ చిన్న తప్పిదం కూడా సమస్యగా మారుతుంది. ఈ సంక్లిష్టతల మధ్య నుంచి నిజమైన శాంతి ఎలా ఉద్భవిస్తుందో చూడాలి.

# అవినీతి 'రవాణా'.. ఆర్టీఏ ఆఫీసులపై ఏసీబీ పంజా!

**- మేడ్చల్, కొండాపూర్, నాగోల్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు**

**- దళారుల గుప్పిట్లో కంప్యూటర్లు, రికార్డు గదులు.. పక్కదారి పట్టిన వందలాది లైసెన్సులు, ఆర్‌సీలు.**

**- పరీక్షల్లేవు.. తిరస్కరణల్లేవు.. అంతా 'కోడ్' భాషలోనే లంచాల దందా!**







**హైదరాబాద్ మే 28 భారత శక్తి:** రాష్ట్రంలోని ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారాయనే ఆరోపణల నేపథ్యంలో యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) అధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. హైదరాబాద్ నగరం, పరిసర జిల్లాల పరిధిలోని మూడు ప్రధాన ఆర్టీఏ కార్యాలయాల్లో బుధవారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మేడ్చల్, కొండాపూర్, నాగోల్ ఆఫీసుల్లో జరిగిన ఈ దాడుల్లో దిగ్భ్రాంతికరమైన అక్రమాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, దళారులు, ప్రైవేట్ డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులతో చేతులు కలిపి అధికారులు సాగిస్తున్న అడ్డగోలు దందాను ఏసీబీ బట్టబయలు చేసింది.

### మేడ్చల్: అప్లికేషన్లపై 'కోడ్' ముద్ర!

మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద అసలు దరఖాస్తుదారులు లేకుండానే, ఒక ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు నాలుగు అప్లికేషన్లతో పట్టుబడ్డాడు. లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) ఇప్పించడానికి, నిబంధనలను పక్కనబెట్టడానికి అభ్యర్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజు వసూలు చేసినట్లు అతను ఒప్పుకున్నాడు. కార్యాలయంలోని దరఖాస్తులను పరిశీలించగా, ఏజెంట్ల పేర్లు, ప్రత్యేక కోడ్‌లు రాసి ఉన్నాయి. ఈ కోడ్ ఉంటే చాలు.. అధికారులు ఎలాంటి ప్రశ్నలు, అభ్యంతరాలు లేకుండా ఫైళ్లను చకచకా క్లియర్ చేస్తున్నట్లు ఏసీబీ విచారణలో తేలింది.

### కొండాపూర్: పోస్టులో వెళ్లాల్సిన కార్డులు ఏజెంట్ల జేబుల్లో..


నిబంధనల ప్రకారం వాహనదారుల ఇళ్లకు స్పీడ్ పోస్ట్ ద్వారా చేరాల్సిన వందలాది డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను (ఆర్‌సీలు) కొండాపూర్ కార్యాలయ సిబ్బంది పక్కదారి పట్టించారు. పౌరులకు పంపకుండా ఆపి ఉంచిన సుమారు 150 ముద్రించిన కార్డులను అనధికార వ్యక్తులు, ఏజెంట్ల నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టెస్ట్ ట్రాక్ వద్ద డ్రైవింగ్ స్కూల్ ప్రతినిధులు తాము తెచ్చిన అభ్యర్థుల జాబితాతో తిరుగుతూ, పరీక్షలతో సంబంధం లేకుండా అందరినీ పాస్ చేయించాలని రవాణా శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తూ దొరికిపోయారు.

### నాగోల్: 185 అప్లికేషన్లు.. 'సున్నా' రిజెక్షన్లు!

నాగోల్ కార్యాలయంలో అవినీతి పరాకాష్టకు చేరింది. ఏజెంట్ల నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా లంచాలు వసూలు చేస్తూ, వారిని ఆఫీసు లోపలికి స్వేచ్ఛగా అనుమతించారు. దాడుల సమయంలో కార్యాలయం లోపల 7 గురు డ్రైవింగ్ స్కూల్ యజమానులు, 8 మంది ఇన్‌స్ట్రక్టర్లు తిష్టవేసి ఉండగా.. వారి వద్ద నుంచి రూ.41,130 నగదును సీజ్ చేశారు.ఒక్కడి వద్దే 184 లైసెన్సులు: సుధాకర్ రెడ్డి అనే ఒకే ఒక్క ఏజెంట్ వద్ద ఏకంగా 184 డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు లభ్యమవడం కలకలం రేపింది. తపాలా శాఖ ద్వారా పంపాల్సిన ఈ కార్డులను డిస్పాచ్ సెక్షన్ సిబ్బంది నేరుగా ఏజెంట్ చేతికే పెట్టడం వెనుక పెద్ద ఎత్తున లంచాలు చేతులు మారినట్లు అనుమానిస్తున్నారు.ట్రాక్ పై డ్రైవింగ్ స్కూల్ కార్లు: డ్రైవింగ్ పరీక్ష రాసే సమయంలో అభ్యర్థుల పక్కన డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్లు కూర్చోవడానికి అధికారులు అనుమతించారు. దీనివల్ల డ్రైవింగ్ రాని వారికి కూడా లైసెన్సులు దక్కుతున్నాయి. తనిఖీ జరిగిన రోజు పరిశీలించిన 185 దరఖాస్తుల్లో ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాకుండా అన్నింటినీ ఆమోదించడం గమనార్హం. దరఖాస్తులపై డ్రైవింగ్ స్కూల్ వాహనాల నంబర్లను కోడ్ భాషగా రాసి లంచాలు వసూలు చేసినట్లు గుర్తించారు.

### ప్రభుత్వ కంప్యూటర్లపై దళారుల రాజ్యం

ఈ మూడు ఆర్టీఏ ఆఫీసుల్లోనూ దళారుల హవా నడుస్తోంది. లైసెన్స్ విభాగాలు, ఆర్‌సీ గదులు, ఆఖరికి ప్రభుత్వ అధికారిక కంప్యూటర్లను సైతం ఏజెంట్లు యథేచ్ఛగా వాడుతున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆన్‌లైన్ లో పౌరులు ప్రభుత్వ ఫీజులు చెల్లించినప్పటికీ, ఈ దళారులే కార్డులను ఆఫీసుల నుంచి దొంగిలించి, అదనపు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను లూటీ చేస్తున్నారు. పలు అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు కూడా బయటపడటంతో వీటిపై ఏసీబీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.



### నివేదిక సిద్ధం.. లంచం అడిగితే '1064'కు ఫోన్ చేయండి.

ఈ ఆకస్మిక తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఏసీబీ సిద్ధం చేస్తోంది. అక్రమాలకు బాధ్యులైన ఆర్టీఏ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదించనుంది.రవాణా శాఖతో పాటు ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే పౌరులు తక్షణమే కింది నంబర్లను సంప్రదించాలని ఏసీబీ కోరింది:

– ఉచిత హెల్ప్‌లైన్ నంబర్: 1064,– వాట్సాప్ నంబర్: 9440446106, సామాజిక మాధ్యమాలు: ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (ట్విట్టర్) (@Telangana_ACB) (ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి).

# బక్రీద్ వేడుకలు: ఈద్గాల వద్ద భారీ బందోబస్తు

**- క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి**

**- ట్రాఫిక్, పార్కింగ్‌పై ప్రత్యేక నిఘా.. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి**





మల్కాజిగిరి, మే 28: భారత శక్తి, బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. బోయినపల్లి, సరూర్ నగర్ కట్ట వద్ద ఉన్న ఈద్గాలను ఆమె సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన రక్షణ చర్యలను, పోలీస్ నిఘాను స్వయంగా పరిశీలించారు. పండుగ ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### - భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం:

ఈద్గా పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, వాహనాల రాకపోకల నియంత్రణ (ట్రాఫిక్), వాహన నిలుపుదల (పార్కింగ్) సదుపాయాలను కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, నిఘా నేత్రాల (సీసీ కెమెరాల) పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

### - కమిషనర్ పిలుపు: సామరస్యంగా పండుగ జరుపుకోండి,

"ప్రజలంతా పరస్పర సహకారంతో, సోదరభావంతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయి. పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలి."

**- సుమతి, పోలీస్ కమిషనర్,**



### -అధికారుల ఉమ్మడి తనిఖీలు

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కమిషనర్‌తో పాటు మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ (డీసీపీ) శ్రీధర్, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ సహా పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అదనపు బలగాలను మోహరించినట్లు అధికారులు వెల్లడించారు.

# నిర్మల్‌లో జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డుల పంపిణీ

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 28(భారత శక్తి)** నిర్మల్ జిల్లా కలెక్టర్ భావేశ్ మిశ్రా ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్ పాల్గొని మొదటి విడతగా పలువురు జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భావేశ్ మిశ్రా మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజానికి సమాచార వారధులుగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారని అన్నారు. అక్రిడేషన్ కార్డులు జర్నలిస్టుల అధికారిక గుర్తింపుగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాచార శాఖ అధికారి విష్ణువర్ధన్, మరియు జర్నలిస్టులు పాల్గొన్నారు.





# విలువలను చాటిచెప్పే గొప్ప పండుగ బక్రీద్

## ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 28 (భారత శక్తి):** త్యాగానికి, భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సందేశంలో బక్రీద్ పండుగ దైవప్రేమ, మానవతా భావం, త్యాగనిరతి, కరుణ వంటి ఉన్నతమైన విలువలను సమాజానికి చాటిచెప్పే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ప్రతి మనిషిలో సేవాభావం, సహనం, పరస్పర గౌరవం పెంపొందించే ఆధ్యాత్మిక సందేశాన్ని బక్రీద్ అందిస్తుందని కలెక్టర్ అన్నారు. మానవత్వం, సోదరభావం, పరస్పర సహకారం వంటి సద్గుణాలను ఈ పండుగ మరింత బలపరుస్తుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో, సామరస్యంతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో బక్రీద్ పండుగ సుఖసంతోషాలు, ఆనందాలు నింపాలని కలెక్టర్ రాజర్షి షా కోరుకున్నారు. జిల్లాలోని ప్రజలు పండుగను ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు.



# తెలంగాణకు టీడీపీ కావాలి


**విజయవాడ, (భారత శక్తి)**తెలంగాణకు టీడీపీ అవసరం ఉందని ఆ పార్టీ నాయకురాలు జ్యోత్స్న.. మహానాడులో పేర్కొన్నారు. తెలంగాణకు నారా లోకేష్ లాంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కావాలని తెలిపారు. ఏపీ విద్యా శాఖకు నారా లోకేష్ మంత్రిగా ఉన్నారని.. కానీ తెలంగాణలో విద్యా శాఖకు ప్రత్యేక మంత్రి లేరని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణలో 22 ఏళ్లుగా టీడీపీ అధికారంలో లేకపోయినా.. తాము పార్టీని వీడకుండా జెండా పట్టుకుని నిలబడ్డామని జ్యోత్స్న వెల్లడించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సందర్భంగా టీడీపీ తెలంగాణ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న.. సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అవసరం ఉందని ఆమె తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడి దిశానిర్దేశం తెలంగాణ రాష్ట్రానికి అవసరమని జ్యోత్స్న పేర్కొన్నారు. ఇక డైనమిక్ ఆలోచనలు ఉన్న నారా లోకేష్ వంటి నేత తెలంగాణకు కావాలని ఆమె కోరారు. అందుకే మళ్లీ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జ్యోత్స్న వెల్లడించారు. మహానాడులో భాగంగా తెలంగాణ విద్యాభివృద్ధి అనే తీర్మానం ప్రవేశపెట్టిన జ్యోత్స్న.. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు సామాజిక న్యాయాన్ని దివంగత నేత ఎన్టీఆర్ కల్పిస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు విస్తృత అవకాశాలు ఇచ్చారని జ్యోత్స్న గుర్తు చేశారు. భవిష్యత్ నైపుణ్యాన్ని నారా లోకేష్ ఇస్తున్నారని పేర్కొన్న జ్యోత్స్న.. దాన్ని తెలంగాణకు కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీని పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎన్నడూ ఓట్ల కోసం రాజకీయం చేయదని తెలిపిన జ్యోత్స్న.. గత 22 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో లేకపోయినప్పటికీ.. పసుపు జెండాను మాత్రం తాము అనుక్షణం గుండెల్లో పెట్టుకుని.. కష్టపడి, పోరాడి నిలబడేవాడే తెలంగాణ కార్యకర్త అని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగం, అభివృద్ధి అనేవి తెలుగుదేశం పార్టీ విధానమని జ్యోత్స్న వెల్లడించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ వేసిన పునాది వల్ల విద్యా విప్లవం రావాలని.. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ వంటి యూనివర్సిటీలు ర్యాంకింగ్‌లోనూ వెనుకబడ్డాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ స్కూళ్లు పేద పిల్లలకు గర్వంగా మారాలని.. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ భరోసాగా ఉండాలని జ్యోత్స్న పేర్కొన్నారు. చదువుకుని డిగ్రీలు ఉన్న యువతకు ఉద్యోగాలు రావాలని.. కానీ తెలంగాణలో ఇవేవీ రాలేదని చెప్పారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మాటలు పెద్దవి.. చేతలు శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనలో విద్యా రంగంలో స్పష్టమైన టైం బౌండ్ రోడ్ మ్యాప్ కనిపించడం లేదని.. అంతేకాకుండా తెలంగాణకు ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రే లేకపోవడం మరో దౌర్భాగ్యం అని జ్యోత్స్న వివరించారు.

# మహానాడు పై వైసీపీ విమర్శ

**తిరుపతి (భారత శక్తి)**తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు మాజీ మంత్రి రోజా. మహానాడు స్టేజ్‌ల మీద రికార్డింగ్ డాన్సులు పెట్టి ప్రజలు తీసుకొచ్చే ఎత్తుగడలు వేశారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలు కూడా మహానాడును పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.. ఇది మహానాడు కాదు దగా నాడని ప్రజలకు అర్థమైందన్నారు. మహానాడు వేదికపై టీడీపీ నేతల భాష, బాడీ లాంగ్వేజ్ అసహ్యంగా ఉందని.. ఇది సైకిల్ పార్టీ మహానాడా?.. సైకో పార్టీ మహానాడా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ కాలి గోటికి సరిపోని వారు కూడా మహానాడు పేరుతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడులో వైఎస్ జగన్ నామస్మరణ చేశారని.. ఆయన పేరు చెబితేనే టీడీపీ నేతలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. గొడ్డలి పార్టీ వైఎస్సార్‌సీపీ కాదు టీడీపీనే.. వివేకా హత్యకేసు నిందితుడు దస్తగిరి, టీడీపీకి సంబంధించిన లాయర్ ఒక్కరేనని విమర్శించారు. వివేకా హత్యలో టీడీపీ హస్తముందని ఆరోపించారు. వైఎస్ జగన్ మహిళా పక్షపాతిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన చేశారని.. చంద్రబాబు మాత్రం మహిళా కక్షపాతిగా మారారంటూ రోజా మండిపడ్డారు. చంద్రబాబు మహానాడు వేదికగా రెండు నాలుకల ధోరణి ప్రదర్శించారని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టే రోజే టీడీపీ మహిళా నేతలంతా ఢిల్లీకి వెళ్లారని.. బిల్లు వీగిపోయిన తర్వాత సాయంత్రం పార్టీ చేసుకున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నవారిని కలిశారు కాబట్టి వాళ్లంతా మహిళా ద్రోహులన్నారు. మహిళా బిల్లు వీగిపోవడానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పార్టీకి వారంతా హాజరయ్యారని.. కాంగ్రెస్‌తో టీడీపీకి హాట్‌లైన్ బంధముందని గతంలో జగన్ చెప్పిన మాట నిజమైందన్నారు. ఉదయం బీజేపీతో బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం కాంగ్రెస్‌తో డిన్నర్ అంటూ టీడీపీని టార్గెట్ చేశారు. కూటమిని ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తే తల్లి, చెల్లి, గొడ్డలి పార్టీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రోజా మండిపడ్డారు. చంద్రబాబు హెరిటేజ్ ఆస్తుల్లో తల్లికి, చెల్లికి ఎంత వాటా ఇచ్చారో చెప్పాలని.. ఆయన తల్లితో, చెల్లితో ఉన్న ఒక్క ఫోటో బయట పెట్టాలన్నారు. వైఎస్ జగన్ తన చెల్లికి దేశంలో ఎవరూ ఇవ్వని ఆస్తి ఇచ్చారని.. వైఎస్ వివేకా హత్య గురించి అధికారంలో ఉన్న చంద్రబాబును సునీత, షర్మిల ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. మంత్రి లోకేష్ రైమింగ్ కోసం చౌకబారు విమర్శలు చేయడం తగ్గించుకోవాలన్నారు రోజా. విద్యాశాఖ మంత్రిగా టోటల్ ఫెయిల్.. కూటమి నేతలు కాళ్లు పట్టుకుంటే గెలవలేని లోకేష్.. వైఎస్ జగన్ నాట్ సేమ్ అంటూ సెటైర్లు పేల్చారు. వైఎస్ జగన్ మూడు నెలల్లో లక్షా 30వేల ఉద్యోగాలు ఇచ్చారని.. లోకేష్ 15వేల టీచర్ పోస్టుల్ని అమ్ముకున్నారని ఆరోపించారు. సుగాలి ప్రీతి పేరు చెప్పి కూటమి అధికారంలోకి వచ్చిందని. ఆమెకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ఈ రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీనలు గాలికి వదిలేశారని.. వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో విడుదల చేసి బుక్ లెట్ ప్రతి గడప గడపకు ఇస్తామన్నారు మాజీ మంత్రి రోజా.

# ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

## - రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి
## - రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి)** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును, నిల్వల పరిస్థితిని, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, ఇంకా ఎంత కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల సామర్థ్యం, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వాహనాలు నిలిచిపోకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. అలాగే మిల్లుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేసి గడువులోగా కొనుగోళు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గడువులోగా నిల్వలను గోదాములకు తరలించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం మెట్రిక్ టన్నుల వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పెంచికల్‌పాడు గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం ఉందని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ తెలియజేయడంతో అక్కడ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, కుంటాల తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం భారీ స్మగ్లింగ్ భగ్నం

## - 334 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం, లారీ సీజ్!
## - రాజస్థాన్ ముఠా అరెస్ట్.. ఆమన్‌గల్ నుండి గుజరాత్‌కు తరలిస్తుండగా ఔటర్ రింగ్ రోడ్డుపై పట్టుకున్న పోలీసులు, ఈటీఎఫ్ సిబ్బంది.

**పహాడీషరీఫ్, మే 28: భారతశక్తి** పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒక పెద్ద నెట్‌వర్క్‌ను పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) అధికారులు గురువారం తెల్లవారుజామున ఉమ్మడి ఆపరేషన్‌తో విజయవంతంగా బట్టబయలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో భారీగా రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న ఒక లారీని అడ్డుకుని సీజ్ చేశారు.

### ఎగ్జిట్-14 వద్ద అర్ధరాత్రి ఆపరేషన్

నమ్మదగిన సమాచారం అందడంతో ఈటీఎఫ్ టీమ్-5 సిబ్బంది పహాడీషరీఫ్ పోలీసులను అప్రమత్తం చేశారు. రెండు బృందాలు కలిసి ఈరోజు తెల్లవారుజామున ఓఆర్ఆర్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా నిఘా పెట్టాయి. ఈ క్రమంలో ఎగ్జిట్-14 వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న గుజరాత్ రిజిస్ట్రేషన్ కలిగిన ఒక 16 టైర్ల భారీ లారీని (+జీ-03-దీ-2618) అధికారులు అడ్డుకున్నారు. లారీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, అందులో ప్లాస్టిక్ సంచులలో దాచిన భారీ మొత్తంలో రేషన్ బియ్యం బయటపడింది. "అధికారులు ఆ బియ్యాన్ని వేబ్రిడ్జ్ వద్ద తూకం వేయించగా.. మొత్తం 33,420 కిలోల (334.20 క్వింటాళ్లు) అక్రమ బియ్యం ఉన్నట్లు నిర్ధారణ అయింది".

### రాజస్థాన్ ముఠా అరెస్ట్.. బియ్యం ఆమన్‌గల్ లోడ్!

లారీని నడుపుతున్న డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పట్టుబడిన నిందితులను రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ ఉర్ఫ్ ఖాన్ (32), క్లీనర్ నవాబ్‌లుగా గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్ ప్రాంతంలో ఈ రేషన్ బియ్యాన్ని లారీలోకి లోడ్ చేశారని, దీనిని గుజరాత్ రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు.

### వెనుక ఉన్న సూత్రధారులు వీరే..

పోలీసుల లోతైన దర్యాప్తులో ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న కీలక వ్యక్తుల వివరాలు సేకరించారు: బియ్యం యజమాని: గుజరాత్‌కు చెందిన ఇలియాస్ అనే వ్యక్తి ఈ బియ్యం యజమానిగా గుర్తించారు.

**లోడింగ్ నిర్వాహకుడు:** స్థానికంగా ఉంటూ బియ్యాన్ని సేకరించి లారీ ఎక్కించిన వ్యక్తి ఎస్. కృష్ణయ్యగా తేలింది.

'మధ్యవర్తి: ఈ రవాణా నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తూ, లారీని సమకూర్చిన మధ్యవర్తిగా అవినాష్ అనే వ్యక్తి వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. వీరందరి మొబైల్ నెంబర్ల ఆధారంగా తదుపరి విచారణ జరుపుతున్నారు.

### రావిర్యాల గోదాముకు బియ్యం తరలింపు

పట్టుబడిన 334.20 క్వింటాళ్ల బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన లారీని అధికారులు సీజ్ చేశారు. ఘటనా స్థలంలో చట్టప్రకారం పంచనామా నిర్వహించి, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని సురక్షిత భద్రత నిమిత్తం రావిర్యాలలోని ప్రభుత్వ స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్ కేంద్రం)కు తరలించనున్నారు.

ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఇన్‌స్పెక్టర్ జి. అజయ్ బాబు, సహాయ అధికారి (ఏపీవో) రమణ, ఇ.టి.ఎఫ్ పోలీస్ కానిస్టేబుల్ నళ్ల ప్రభాకర్ మరియు ఈటీఎఫ్ టీమ్-5 సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.




# చర్లపల్లిలో కమర్షియల్ సిలిండర్ల అక్రమ రవాణా గుట్టురట్టు!

## - మూడు వాహనాలు, 170 సిలిండర్లు సీజ్.. ఇద్దరిపై 6A కేసు నమోదు
## - రంగంలోకి దిగి ఆపరేషన్ విజయవంతం చేసిన జి. అజయ్ బాబు,రమణ, నర్ర. ప్రభాకర్



**చర్లపల్లి, మే 28: భారత శక్తి,** నగర శివార్లలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందాను అధికారులు ఛేదించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం, ఇ.టి.ఎఫ్ (టీమ్-5) బుధవారం చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మెరుపు దాడులు నిర్వహించింది. మూడు రవాణా వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న భారీ సిలిండర్ల నిల్వలను పట్టుకొని సీజ్ చేసింది.

### నమ్మదగిన సమాచారంతో వ్యూహాత్మక నిఘా

వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి అధికారులకు ఖచ్చితమైన సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ప్రత్యేక బృందం చర్లపల్లి పరిధిలో వ్యూహాత్మకంగా నిఘా పెట్టింది. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న మూడు గూడ్స్ వాహనాలను అడ్డుకొని తనిఖీ చేయగా ఈ భారీ అక్రమ రవాణా వ్యవహారం వెలుగుచూసింది.

**సీజ్ చేసిన సిలిండర్లు, వాహనాల వివరాలు:** అధికారుల తనిఖీల్లో పట్టుబడిన సొత్తు వివరాలు ఇలా ఉన్నాయి:

**గ్యాస్ సిలిండర్లు:** రూ. లక్షల విలువైన 19 కేజీల బరువు గల 148 వాణిజ్య సిలిండర్లు, అలాగే 46.5 కేజీల బరువు గల 22 వాణిజ్య సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రవాణా వాహనాలు: సిలిండర్లను అక్రమంగా తరలిస్తున్న అశోక్ లేలాండ్ (TS08-UE-6087), మహీంద్రా సుప్రో (TG08-U-5282), బొలెరో (TS08-UA-9605) వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

### స్పాట్‌లోనే పంచనామా.. నిందితులపై కేసు నమోదు

పోతరాజు, శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకుండా ఈ సిలిండర్లను తరలిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ సర్కిల్ సహాయ పౌరసరఫరాల అధికారి (ఫూజూూా) తక్షణమే ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న 170 సిలిండర్లను భద్రత నిమిత్తం సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి తరలించారు. నిబంధనలు ఉల్లంఘించిన మూడు వాహనాలను సీజ్ చేసి, నిందితులపై నిత్యావసర వస్తువుల చట్టం కింద 6A కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

### అధికారుల చాకచక్యం!

ఈ ఆపరేషన్‌ను అత్యంత సాహసోపేతంగా, చాకచక్యంగా నిర్వహించి అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఛేదించడంలో ఈ ముగ్గురు అధికారులు కీలక పాత్ర పోషించారు జి. అజయ్ బాబు (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్) -- తన వ్యూహాత్మక ప్లానింగ్‌తో టీమ్‌ను ముందుండి నడిపించి, అక్రమార్కులకు చిక్కకుండా నిఘా వేసి పట్టుకున్నారు. రమణ(అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ - APO) -- సమాచారం అందిన వెంటనే స్పాట్‌కు చేరుకొని, చట్టపరమైన చర్యలు వేగవంతం చేసి పంచనామా ప్రక్రియను పూర్తి చేయించారు. నర్ర. ప్రభాకర్ (పోలీస్ కానిస్టేబుల్) -- క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించి, అనుమానిత వాహనాలను చాకచక్యంగా అడ్డుకొని తనిఖీలు చేపట్టారు. ఈ ముగ్గురు అధికారుల మెరుపు దాడితో స్థానిక బ్లాక్ మార్కెట్ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నిందితుల వెనుక ఉన్న ప్రధాన ముఠా సూత్రధారుల కోసం నిఘా తీవ్రం చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

భారత శక్తి
VOICE OF INDIAN



# కరెంట్ షాక్ కారణంగా వ్యక్తి మృతి.



రేగొండ, మే 28 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రూపి రెడ్డిపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కనుకుంట్ల గోపి (46), వృత్తి వ్యవసాయం, ఈ రోజు ఉదయం ఇంటి ముందు మోటార్ ఆన్ చేసి డ్రమ్ముల్లో నీళ్లు పట్టుకుంటుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఇటీవల గోపి తండ్రి సమ్మయ్య వృద్ధాప్యంతో మృతి చెందగా, మూడవ రోజు కార్యక్రమ ఏర్పాట్లలో కుటుంబ సభ్యులు నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 5 గంటల సమయంలో గోపి ఇంటి ముందు ఉన్న మోటార్ ఆన్ చేసి నీళ్లు పట్టుకుంటుండగా, అక్కడ ఉన్న రేకులకు చేయి తగిలింది. అప్పటికే విద్యుత్ తీగ పేలి ఉండటాన్ని గమనించకుండా రేకులను పట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలింది. ఆయనను రక్షించేందుకు వెళ్లిన కుటుంబ సభ్యురాలికీ స్వల్పంగా కరెంట్ షాక్ తగిలినట్లు తెలిసింది. అనంతరం కుటుంబ సభ్యులు వెంటనే గోపిని ప్రభుత్వ ఆసుపత్రి, పరకాలకు తరలించగా, డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఫిర్యాదురాలు మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగొండ ఎస్సై డి సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ నటీనటులకు, కవులకు,కళాకారులకు, ప్రాధాన్యత ఇవ్వాలి

**-సీనియర్ జర్నలిస్టు,కవి, రచయిత,కందుకూరి యాదగిరి**



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మే 28: నిర్మిస్తున్న ప్రతి సినిమాలో టీవీ సీరియల్ లో టీవీలలో ప్రచారం అవుతున్న ప్రతి కార్యక్రమాలలో తెలంగాణ వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని సీనియర్ పాత్రికేయులు కవి రచయిత కందుకూరి యాదగిరి గురువారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రత్యేక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు చెందిన ఎంతోమంది కళాకారులు కవులు రచయితలు కావలసినంత టాలెంట్ ఉన్నప్పటికీ ఆంధ్ర వారికి సినిమాలలో వచ్చినంత గుర్తింపు తెలంగాణ వారికి రాలేదన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారికి తెలుగు సినిమా ఇండస్ట్రీలో కావాల్సినంత గుర్తింపు రాకుండా పోవడానికి కారణం ఆంధ్ర పెత్తందారితనంలో సినీ ఇండస్ట్రీ కొనసాగడమే అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల నాయకత్వంలో 60 సంవత్సరాలు అన్ని రంగాలలో తెలంగాణ ప్రాంతం అంచివేతకు గురైన సంగతి అభివృద్ధికి నోచుకోని సంగతి గుర్తు చేశారు. ముఖ్యంగా తెలుగు ఇండస్ట్రీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు పెద్దలుగా వ్యవహరిస్తున్న కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కవులకు కళాకారులకు సాహిత్యకారులకు రావాల్సినంత గుర్తింపు సినిమా ఇండస్ట్రీలో రాలేదని కొంతమందికి మాత్రమే కొంతమేరకు గుర్తింపు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా కొన్ని రంగాలలో ఆంధ్ర పాలకుల పెత్తనం కొనసాగడం బాధాకరమన్నారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ దీన్ని దృష్టిలో పెట్టుకొని సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కవులకు కళాకారులకు సాహిత్యకారులకు నటీనటులకు ప్రాధాన్యతను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సృజనాత్మకత ఉండి ఎలాంటి గుర్తింపు లేని ఔత్సాహిక నటీనటులు కవులు కళాకారులు సాహిత్యకారులు రచయితలు తమలాంటి వారికి తగిన గుర్తింపుని ఇవ్వాలని కోరుతూ ఈ డిమాండ్లపై ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చే విధంగా ఉద్యమం చేపట్టేలా తమతో కలిసి రావాలని యాదగిరి పిలుపునిచ్చారు. ఈ విషయమై త్వరలోనే తెలంగాణ రాష్ట్ర సినిమా ఆటోగ్రఫీ మంత్రి ని కలుస్తామని తెలిపారు. తమతో కలిసి వచ్చేవారు ఈ 9640282050 నెంబరును సంప్రదించాలని పిలుపునిచ్చారు.

## బక్రీద్ ప్రత్యేక ప్రార్థన లో పాల్గొన్న తెలంగాణ సాంస్కృతిక ఉద్యమకారులు

**ఐక్యవేదిక నాయకులు వి.ఎం ఎల్లయ్య...మంద భాస్కర్ రెడ్డి**



గుమ్మడిదల , మే 28 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి ఈద్గా వద్ద బక్రీద్ పండుగ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కన్వీనర్ మంద బాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు రైల్ రోకో, రాస్తారోకో, సడక్ బంద్, వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి అనేక పోరాట కార్యక్రమాల ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా అనేక మంది ఉద్యమకారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజాపాలనలోనైనా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు లేదా కళాశాలల్లో ఉచిత విద్య అందించాలని, గౌరవ వేతనం మంజూరు చేయాలని, ఆరోగ్య రక్షణ కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. బక్రీద్ పర్వదినం శాంతి, ప్రతీక అని పేర్కొంటూ సమాజంలో అన్ని వర్గాలు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంద బాస్కర్ రెడ్డితో పాటు దర్గా శ్రీనివాస్, వాలందాస్ మల్లేష్ గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, డప్పు జీవన్ కుమార్, రామకృష్ణ గౌడ్, ఎండి గరీబ్, రఫిక్ ,వడ్డెర ఎల్లయ్యలు పాల్గొని పరస్పరం అలయ్ బలయ్ తీసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## కోటంచ లక్ష్మీ నరసింహాన్ని దర్శించుకున్న మాజీ చైర్మన్ నాగూర్ల వెంకన్న.

రేగొండ,మే28 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ లోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం కొడవటంచ నరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకునేందుకు మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆలయానికి రావడంతో టిఆర్ఎస్ శ్రేణులు పలువురు మిత్రులు ఘన స్వాగతం పలికారు. కొడవటంచలోని ప్రసిద్ధ నరసింహస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు దర్శనంకు రావడంతో ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు దగ్గరుండి ప్రత్యేక పూజలు పూజారులతో జరిపించారు. ఈ సందర్భంగా నాగర్ల వెంకన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నారు. ఆలయ అర్చకులు సురేష్ ఆచార్య నాగూర్లకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని, రైతులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆలయ చైర్మన్ ఎన్. సంపత్ రావు,ఆలయ నిర్వాహకులు, స్థానిక భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ మాదాటి కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు కుసుంబ రంజిత్ కుమార్, పబ్బ శ్రీనివాస్ గౌడ్, నాయకులు జూపాక భాస్కర్,వంచనగిరి వీరేశం, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్.టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినమల్ రెడ్డి రాంరెడ్డి.





వనస్థలిపురం, మే 28: భారత శక్తి, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఎల్బీనగర్ నియోజకవర్గంలో వైభవంగా జరిగాయి. వనస్థలిపురంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఉన్న రామారావు విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

**- పేదల పాలిట పెన్నిధి ఎన్టీఆర్: మల్ రెడ్డి రాంరెడ్డి,**

విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం సుస్థిరమని, ఆయన ఆశయాలు, ఆదర్శాల బాటలో పయనించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత రామారావుదేనని స్పష్టం చేశారు.

**- తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు:**

ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, ముదగోని లక్ష్మి ప్రసన్న, వెంకట్ గాంధీ, రాజుబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, రామారావు, గణేష్ నాయక్ పాల్గొన్నారు. అలాగే డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కె. శశిధర్ రెడ్డి, కసోజు శ్రీనివాస్, జంగీర్ బాబు గౌడ్, వెంకట్రామ్ రెడ్డి, భుజంగ రెడ్డి, నోముల కృష్ణ గౌడ్, వెనులయ్య గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, యుగంధర్ సహా పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి నివాళు లర్పించారు.

## మునీందర్ & బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను సందర్శించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి): ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ ఓ బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము కేటాయించడం జరిగిందని, ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## శీర్షిక:ఆస్పత్రి మంచం...!!

ఆగర్భ శ్రీమంతులకైన
కటిక దరిద్రులకైన
తల్లి ప్రేగు తెంచుకుంటే
తొలిసరిగా
పట్టు పరుపై
నీ జనన ధ్రువీకరణ
ఈ జగత్తుకు
పరిచయం చేసింది
ఆస్పత్రి మంచమేగా...!!

ఆసుపత్రి ఒదిలి
వెళ్లునప్పుడు
ఇటు పక్క మరల రాకు
నిండు ఆయుష్ తో
నూరేళ్లు జీవించు
అని దీవించి సాగనంపింది
ఆసుపత్రి మంచమెగా...!!

రావద్దన్న వచ్చిన
నిన్ను కసురుకోక
కడుపునొచ్చి
కాలు నొచ్చి
ఆసుపత్రికి వస్తే
నయం అయ్యేదాకా
సేద తీర్చింది
ఆసుపత్రి మంచమేగా...!!

నీ మాయిముంత
ఆస్పత్రి ఆవరణ లోనే
ఉందంటూ మంచానికి
అంటిన నీ రక్తపు
మరక గుర్తు ఏదో
చెప్పగలవా అంటూ
ప్రశ్నించింది ఆసుపత్రి మంచమేగా..!!

ఆస్పత్రి మంచంపై
తొలిసారి ఊపిరి
తీసుకునపుడు
నిన్ను ముద్దాడ వచ్చిన
నీవారిని ఆనంద డోలకంలో
విహరింప చేసి ఊపింది
ఆస్పత్రి మంచమేగా...!!

నీవు తుది శ్వాస
వదులుతుంటే
బంధువులంతా
నీపై పడి బోరున ఏడుస్తుంటే
వారిని ఓదార్చి సేద తీర్చిది
ఆస్పత్రి మంచమేగా...!!

ఊపిరి వదిలి
నిర్జీవి అయితే
నీకు నాకు
రుణం తీరిందని
వీడ్కోలు పలికి
మరో శిశువుకు
తొలి పరుపుగా
సిద్ధమైతుంది
ఆసుపత్రి మంచమేగా...!!

అలా ఎంతమందిని మోసిందో
రెక్కలు విరిగితే
పాత ఇనుప సామాను
దుకాణపోడు నలగదంచి
ముద్దచేసి పెద్ద ఫ్యాక్టరీకీ
అమ్మితే మరో కొత్త
మంచమై ఆస్పత్రికి వచ్చే...!!



కవి
దాసరి లక్ష్మయ్య
కలం:-నా అక్షరం దాసరి
ఊరు:-పెద్దమరూర్
వనపర్తి 9063415816

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి): ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయబడి కేటాయించబడిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేట లోని సుముఖ గోదాము, హాజీపూర్ మండలంలోని గాయత్రి రైస్ మిల్లును అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలును చేపట్టడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు.
రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతిని వేగవంతంగా చేపట్టాలని, రోజుకి కనీసం 40 నుంచి 50 లారీల ధాన్యం దిగుమతిని చేయాలని తెలిపారు. ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను సమకూర్చడం జరిగిందని, దిగుమతి త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**- మంత్రి గడ్డం వివేకానంద**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి):ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 2022-23 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జూన్ 6వ తేదీ వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక లారీలను ధాన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి



సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూర్ నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూర్, కోటపల్లి మండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరెంటు లేని నివాసాలకు వెలుగులు అందించిన సర్పంచ్ రవళిక



రేగొండ, మే 28 (భారత శక్తి): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రామన్నగూడెం తండా సర్పంచ్ బానోతు రవళిక- వీరు నాయక్ గ్రామ పంచాయతీ ఎలక్షన్లో గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. గ్రామంలో 11 కెవి విద్యుత్ లైన్ గ్రామ ప్రధాన కూడలి నుండి గ్రామం మీదుగా వెళుచుండగా గత పాలకులు గ్రామ ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా, దానిని తీసివేయలేదు దాంతో ప్రజలు భయభ్రాంతులతో గడిపారు. ప్రస్తుత సర్పంచ్ ఇచ్చిన మాట ప్రకారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో సుమారు నాలుగు లక్షల విలువగల విద్యుత్ పనిని 11 విద్యుత్ లైన్ ను తీసివేయించి ఊరి బయట నుండి లైన్ వేయించారు. గ్రామంలో విద్యుత్ వెలుగులు లేనివి గుర్తించి వారికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామ ప్రజలు సహకరించిన ఎమ్మెల్యే , సర్పంచ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. మునుముందు ఇంకా గ్రామ అభివృద్ధికి పాటుపడాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ వీరు నాయక్ గ్రామానికి సహకరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## బక్రీద్ పండుగ సమయంలో కూడా సేవలను అందిస్తున్న ముస్లిం సోదరులకు దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేసిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 28: బక్రీద్ పండుగ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో రవాణా సేవలను అందిస్తున్న ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పండుగ సమయంలో కూడా వరి ధాన్యం రవాణా సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తూ రైతులకు సహకరిస్తున్న డ్రైవర్ల సేవలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్ల సేవలను అభినందిస్తూ వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణాదారులు, డ్రైవర్లు, మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై ఈడి దాడులు దుర్మార్గమైన చర్య




మణుగూరు, మే 28 (భారతశక్తి) : కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పై కాంగ్రెస్, బిజెపి కుట్రపూరిత చర్యను ఖండించాలని సిపిఎం పార్టీ కార్యాలయం ఎదుట గురువారం సిపిఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ.. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిపిఎం ప్రతిపక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ పై బిజెపి, కాంగ్రెస్ మూకలు అనవసరమైన ప్రచారాలు చేస్తూ 2013లో కొట్టేసిన కేసును ఆధారాల కోసమని మాజీ ముఖ్యమంత్రిపై, వారి కుటుంబ సభ్యుల నివాసాలలో ఈడీ దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. సిపిఎంను నైతికంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు అబద్ధపు మాటలతో పూట గడుపుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తూ రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లం రాజు, ములకల ఉత్తం, ఎస్ వెంకట్రావు, గుర్రం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యం సైతం కొనుగోలు

**- రైతులు నష్టపోకుండా చర్యలు.**

**- ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలి**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి): అకాల వర్షాలకు తడిసినకారణంగా జిల్లాల్లో ధాన్యం తడిసిన పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు. ములుగు జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిసిన పరిస్థితులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అనుకొని పరిస్థితుల వర్షాలతో ధాన్యం తడిసినా, నిబంధనల ప్రకారం పరిశీలించి కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించి కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం రైతులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 76 వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేయగా, రైతుల ఖాతాల్లో కనీస మద్దతు ధర కింద రూ. 141 కోట్ల పైగా జమ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా 9 వేల కు పైగా రైతులు లబ్ధి పొందినట్లు తెలిపారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతోందన్నారు. అవసరమైన చోట టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు, వేగవంతమైన రవాణా ఏర్పాట్లు కల్పిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన అన్ని ఏజెన్సీలు, సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓలు, డీసీఓలు, జీసీసీ ప్రతినిధులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వర్షాలు వచ్చే పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వర్షం వల్ల ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన చోట టార్పాలిన్లతో కప్పి భద్రపరచాలని సూచించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు సమీప కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోలులో సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్/కంట్రోల్ రూం నంబర్ 9347416178 ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మండుటెండలో.. మగ్గిపోతూ..!

**-విక్రయ వసతులు కల్పించాలి -అటవీ ఉత్పత్తుల విక్రయేతలు**

మణుగూరు, మే 28 (భారతశక్తి): పట్టణంలోని మణుగూరు టూ పినపాక వెళ్లే ప్రధాన రహదారి వెంబడి రోహిణికార్తెలో రొళ్లు సైతం పగిలే మండుటెండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వీధి విక్రేతల జీవనం మరింత కష్టసాధ్యంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు మండుతున్న ఎండలో రోడ్ల పక్కన కూర్చొని పండ్లు, అటవీ ఉత్పత్తులు విక్రయిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. మణుగూరు మండలం చుట్టుపక్కల గ్రామాలు, అటవీ ప్రాంతాల నుంచి ప్రతి సీజన్లో లభించే తాటిముంజలు, వివిధ రకాల పండ్లు, చింతపండు, చింతచిగురు, ఉసిరికాయలు, జామకాయలు, బొప్పాయి, నిమ్మపండ్లు వంటి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను మణుగూరు మండల కేంద్రానికి తెచ్చి అమ్ముతుంటారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఇవే వారి కుటుబాల పోషణకు ప్రధాన ఆదాయ వనరు. తమపొలాల్లో పండే కూరగాయలను కూడా తెచ్చివిక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయితే ఈసీజనల్ విక్రేతలకు సరైన విక్రయ వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోహిణి కార్తె లో ఎండ తీవ్రత ఎక్కువగా వున్న మండుటెండలో రహదారుల పక్కన ఎలాంటి నీడాలేకుండా కూర్చొని అమ్ముకోవాల్సి వస్తోంది. త్రాగునీరు, విశ్రాంతి స్థలం వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడం వారి పరిస్థితిని వేసవిలో ఎండల తీవ్రతతో తల తిరగడం, అలసట, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుబజార్లు, శాశ్వత మార్కెట్ స్థలాలు ఏర్పాటు చేస్తే వీరికి ఉపయోగకరంగా ఉంటుంది. కనీసం తాత్కాలిక షెడ్లు, నీడ, త్రాగునీటి సదుపాయం కల్పిస్తే వారు సురక్షితంగా విక్రయాలు కొనసాగించ గలరని విక్రేతలు చెబుతున్నారు. వీధుల్లో విక్రయాలు చేస్తున్న వారిలోఎక్కువ మంది ని కుటుంబాలకు చెందిన వారే. ఎండల్లో ఎండుతూ, వానల్లో తడుస్తూ జీవనోపాధి కోసం కష్టపడుతున్నారు. తమ ఉత్పత్తులు విక్రయించేందుకు ప్రత్యేకంగా స్థలం, కనీస వసతులు కల్పించాలని అధికారులను విక్రేతలు వేడుకుంటున్నారు. ళి28/05, 6:24 జూఎరి చీవతీశీయబ ఘుజఱఅఎవతీ: లిబక్రీద్ పండుగ సమయంలో కూడా సేవలను అందిస్తున్న ముస్లిం సోదరులకు దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేసిన జిల్లా కలెక్టర్ కామారెడ్డి



జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 28: బక్రీద్ పండుగ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో రవాణా సేవలను అందిస్తున్న ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పండుగ సమయంలో కూడా వరి ధాన్యం రవాణా సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తూ రైతులకు సహకరిస్తున్న డ్రైవర్ల సేవలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్ల సేవలను అభినందిస్తూ వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణాదారులు, డ్రైవర్లు, మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ చొరవతో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన జిల్లా యంత్రాంగం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 28: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చొరవతో వేగవంతంగా నడిచాయి. కామారెడ్డి జిల్లాలో ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాల కారణంగా రామారెడ్డి, దోమకొండ, సదాశివనగర్ , మాచారెడ్డి మండలాల పరిధిలోని కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (పిపిసిఎస్) పాక్షికంగా, పూర్తిగా తడిసిన ధాన్యం నిల్వలు నమోదయ్యాయి. సుమారు 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం వర్ష ప్రభావానికి గురైన సందర్భంగా అధికారులు జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ అధికారులు, డిఆర్డీఓ లు, డిసిఓలు, పిపిసి ఇన్‌చార్జీలు , ఫీల్డ్ స్థాయి సిబ్బంది వెంటనే కొనుగోలు కేంద్రాలకు చేరుకుని చర్యలు చేపట్టారు. ప్రభావితమైన 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీపంలోని పార్బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి భద్రపరిచారు. ధాన్యం మరింత దెబ్బతినకుండా ఉండేందుకు రవాణా, అన్‌లోడింగ్ , నిరంతర పర్యవేక్షణ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు .జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం స్పందించి తీసుకున్న చర్యలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. వాతావరణ హెచ్చరికలు మరిన్ని వర్షాల అవకాశాల దృష్ట్యా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,82,760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, దాని విలువ రూ. 914.41 కోట్లుగా నమోదైంది. ఇందులో 3,27,996 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ. 783.57 కోట్ల చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని మొత్తం చెల్లింపుల శాతం 86 శాతానికి చేరుకుందన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు, అలాగే అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు, రవాణా చెల్లింపుల ప్రక్రియలను సజావుగా కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం అహర్నిశలు పర్యవేక్షిస్తున్నదని కలెక్టర్ తెలిపారు.

# ఎన్టీఆర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..!!

**-103వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.**



కడప, మే 28 (భారత శక్తి ): తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు చిరస్మరణీయమని, నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ 103వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1923 మే 28న మన రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో జన్మించి ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల గౌరవాన్ని పెంచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా తనదైన ముద్ర వేసి కోట్లాది ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న మహానాయకుడని పేర్కొన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో "అన్నగారు"గా చిరస్థాయిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. పౌరాణిక పాత్రలకు జీవం పోసి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పారని కొనియాడారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఎన్టీఆర్, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. కేవలం తొమ్మిది నెలల్లోనే ప్రజాభిమానంతో అధికారంలోకి రావడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేయడం వంటి నిర్ణయాలు సామాజిక మార్పుకు దోహదపడ్డాయని తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఎన్టీఆర్ జీవితం క్రమశిక్షణ, పట్టుదల, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిందని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. డిఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక్క నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

తెలుగు, తమిళం, హిందీ, గుజరాతీ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి, పౌరాణిక పాత్రలకు జీవం పోసిన మహానటుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి పాత్రల్లో ఆయన నటన తెలుగు ప్రజల హృదయాల్లో దైవస్వరూపంగా నిలిచిపోయిందన్నారు. సినీ రంగంలో అపార ప్రజాదరణ పొందిన తర్వాత ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఎన్టీఆర్, తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. ప్రజల మధ్యకే వెళ్లి "చైతన్య రథం" ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజల్లో చైతన్యం నింపారని తెలిపారు. కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘనత సాధించారని పేర్కొన్నారు. స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు అమూల్యమని, తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన మహానుభావుడని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, క్రమశిక్షణ, ప్రజాసేవకు ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో పేద ప్రజల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ వివరించారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన దూరదృష్టి గల నాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. నేటి యువత ఎన్టీఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వం, సమాజ సేవ భావన అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలు, సంక్షేమ భావజాలం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, డీఏవో సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏపీఎంఐపి పీడి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్టీఆర్ అభిమానులు, విద్యార్థులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ఖర్జూరాలు తింటే..?

ప్రతి రోజు మూడు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యపరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఫైబర్, ప్రోటీన్, పొటాషియం, మెగ్నీషియం, కాపర్ వంటి మూలకాలు లభిస్తాయి. వర్షాకాలంలో ఎదురయ్యే ఇన్ఫెక్షన్లు, ఇతర అనారోగ్యాలతో పోరాడే శక్తిని ఖర్జూరాలు శరీరానికి అందిస్తాయి. నిద్రలేమి సమస్యకు ఖర్జూరాలు మంచి మందుగా పని చేస్తాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఖర్జూరాలు తినటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది..ఖర్జూరాల్లో పీచు అధికంగా ఉంటుంది.. మలబద్ధకం, ఎసిడిటీ వంటి జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెడుతుంది. ఖర్జూరాలను తినడం వల్ల శరీరంలోని అనవసర కొవ్వుల్ని కరిగించి, చక్కటి శరీరాకృతిని మనకు అందిస్తుంది. ఖర్జూరంలో కాల్షియం, ఫాస్పరస్ ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచుతాయి. ఖర్జూరాలు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచడంలో సహాయపడతాయి. శరీరానికి శక్తిని అందిస్తాయి. ఇది నిద్ర రుగ్మతలను తొలగిస్తుంది. అలెర్జీలతో పోరాడటానికి సహాయపడుతుంది. ఖర్జూరాలు ఇన్ఫెక్షన్లతో పోరాడి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. మలబద్ధకం, ఆమ్లత్వం వంటి సమస్యలలో కూడా ఉపశమనం కలిగిస్తాయి. నెలసరి సమయంలో ఖర్జూరాలు తీసుకోవడం వల్ల అటు ఆరోగ్యంతో పాటు ఇటు నెలసరి నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచే శక్తి ఖర్జూరాలకు ఉందని పలు అధ్యయనాల్లో రుజువైంది. ప్రసవానికి దగ్గరలో ఉన్న మహిళలు ఖర్జూరం తినడం వల్ల సుఖప్రసవం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఏ వయసు వారైనా సరే..



పరగడుపున ఖర్జూరాలను తీసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు మూడు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యపరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఫైబర్, ప్రోటీన్, పొటాషియం, మెగ్నీషియం, కాపర్ వంటి మూలకాలు లభిస్తాయి. వర్షాకాలంలో జీర్ణ సమస్యలు ఎక్కువగా వస్తాయి. జీర్ణ సమస్యలను దూరం చేసుకునేందుకు ఖర్జూరం తినడం ఉత్తమం. ఖర్జూరంలోని ఫైబర్ ఆహారం అరుగుదలను ప్రోత్సహిస్తుంది.

# అతిగా తిన్నారో కష్టాలు తప్పవట..!

భారతదేశంలో పెస్టిసైడ్స్ నిల్వలు ఎక్కువగా ఉండే పండ్లలో యాపిల్ ఒకటి. యాపిల్ పండ్లలో ఎక్కువగా డైఫినైల్అమైన్ అనే కెమికల్ ఉంటుంది. దాంతో ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. అందుకే రోజుకు ఒకటి లేదా రెండు యాపిల్స్ తినటం ఆరోగ్యానికి మంచిదని, మేలు చేస్తుందని చెబుతున్నారు. వీటి కంటే ఎక్కువగా తింటే పైన చెప్పిన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. యాపిల్ పండ్లలో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. కానీ ఎక్కువగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. రోజుకు 20–40 గ్రా ఫైబర్ తీసుకుంటే సరిపోతుంది. యాపిల్ పండ్లలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి. అలాగే రక్తంలో షుగర్ లెవెల్స్ పెంచుతాయి. అందుకే ఎక్కువగా యాపిల్స్ తింటే డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. యాపిల్‌లోని కార్బోహైడ్రేట్స్ శక్తిని ఇవ్వడంతో పాటు బరువు పెరగడానికి కారణమవుతాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారు యాపిల్ పండ్లు ఎక్కువగా తినకపోవడమే మంచిది. యాపిల్ పండ్లలో మాలిక్ యాసిడ్ ఉంటుంది. దీని ఆమ్ల స్వభావం వల్ల దంతాలపై ఎనామిల్ పొర దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే దంత సమస్యలు ఉన్నవారు యాపిల్స్ ఎక్కువగా తినకూడదు. యాపిల్ పండ్లు జీర్ణ సంబంధ సమస్యలు ఉన్నవారు తినకపోవడమే మంచిది. వీటిలోని అధిక షుగర్ వల్ల తొందరగా జీర్ణం కాదు. దీంతో అజీర్ణం సమస్య ఏర్పడుతుంది. యాపిల్ పండ్లలో నేచురల్ షుగర్స్, కెమికల్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. అందుకే ఈ పండ్లు ఎక్కువగా తింటే గుండె సంబంధ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. యాపిల్ పండ్లు తినడం వల్ల కొంతమందికి నీరసంగా ఉంటుంది. తిన్న యాపిల్ సరిగా జీర్ణం కాకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.



అటువంటి సమస్య ఉంటే యాపిల్ పండ్లు తినకపోవడమే మంచిది. భారతదేశంలో పెస్టిసైడ్స్ నిల్వలు ఎక్కువగా ఉండే పండ్లలో యాపిల్ ఒకటి. యాపిల్ పండ్లలో ఎక్కువగా డైఫినైల్అమైన్ అనే కెమికల్ ఉంటుంది. దాంతో ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. అందుకే రోజుకు ఒకటి లేదా రెండు యాపిల్స్ తినటం ఆరోగ్యానికి మంచిదని, మేలు చేస్తుందని చెబుతున్నారు. వీటి కంటే ఎక్కువగా తింటే పైన చెప్పిన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.


# ఈ వ్యాధులకు కొత్తిమీర మందు..!

కొత్తిమీరను వినియోగించడం చాలా సులువు. నేరుగా ఆకులు తినొచ్చు. ప్రతి కూరపై నుంచి జల్లుకోవచ్చు. కొత్తిమీర రైస్ చేసుకోవచ్చు. మజ్జిగలో కలుపుకొని తాగొచ్చు. రసంగా తాగొచ్చు. గ్యాస్, కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కొత్తిమీర రసం వాటి నుంచి ఉపశమనం ఇస్తుంది. కొత్తిమీర ఆకులను కషాయంగా చేసి పుక్కిలిస్తే చిగుళ్ల నొప్పులు, దంతాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. మనం వంటల్లో చాలా రకాల ఆకుకూరలు ఉపయోగిస్తాము. వాటిలో అత్యంత ప్రత్యేకమైనది 'కొత్తిమీర ఆకు'. కొత్తిమీర ప్రతి ఆహారం రుచి, వాసనను పెంచుతుంది. ఈ ఆకులు రుచిని పెంచడమే కాకుండా మన శరీరానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఆయుర్వేదంలో కొత్తిమీరను ఔషధంగా పరిగణిస్తారు. కొత్తిమీరను అనేక సాంప్రదాయ వైద్య విధానాలలో కూడా ఉపయోగిస్తారు. కొత్తిమీర ఆకులలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిలో విటమిన్లు ఞా, జ, ఖ ఉంటాయి. ఇవి కళ్ళు, చర్మం, ఎముకలకు చాలా ముఖ్యమైనవి. దీనితో పాటు, ఫోలేట్, కాల్షియం, పొటాషియం, ఇనుము, మెగ్నీషియం వంటి మూలకాలు కూడా ఇందులో ఉన్నాయి. కొత్తిమీర జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో ఈ ఆకులను నమలడం లేదా వాటి నీరు త్రాగడం వల్ల గ్యాస్, అసిడిటీ మరియు మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీరలో ఉండే విటమిన్ సి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీర రోగనిరోధక శక్తి బాగున్నప్పుడు, జలుబు, దగ్గు, జ్వరం వంటి కాలానుగుణ వ్యాధులు త్వరగా రావు. కొత్తిమీరలోని పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను కూడా సమతుల్యం చేస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఎ చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. కొత్తిమీర నీరు శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది కాలేయం, మూత్రపిండాలు సరిగ్గా పనిచేసేలా చేస్తుంది. కొత్తిమీరలోని ఫోలేట్ గర్భిణీ స్త్రీల మరియు వారి పుట్టబోయే బిడ్డ అభివృద్ధికి



చాలా అవసరం. గర్భధారణ సమయంలో ఇది పోషకాలకు మంచి వనరుగా ఉంటుంది.

# ఉదయం టిఫిన్ తినకపోతే..



చాలా మంది టిఫిన్ స్కిప్ చేసి మధ్యాహ్నం నేరుగా భోజనం చేస్తారు. కానీ ఇలా చేయడం వల్ల వారి ఆరోగ్యానికి హానికరం. మన శరీరం ముఖ్యంగా ఉదయం తినే టిఫిన్ నుంచి ఎక్కువ శక్తిని పొందుతుంది. ఉదయం పోషకమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలని అంటారు. ఇది శరీరానికి రోజంతా శక్తిని ఇస్తుంది. ఇది మన మొత్తం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ నేటి బిజీ షెడ్యూల్‌లో.. చాలా మంది దీనిని విస్మరిస్తారు. ఉదయం తమ పనులన్నీ హడావిడిగా చేసిన తర్వాత వారు ఆఫీసుకు వెళ్లే క్రమంలో టిఫిన్‌ను స్కిప్ చేస్తారు.అదే సమయంలో కొంతమంది బరువు తగ్గడానికి అల్పాహారం మానేస్తారు. కానీ ఇలా చేయడం అస్సలు మంచిది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అల్పాహారం మానేస్తే ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది. ఇది రోజంతా అలసట, బలహీనతకు కారణమవుతుంది. దీని కారణంగా మానసిక స్థితిలో హెచ్చుతగ్గులు వస్తాయి. టిఫిన్ తినకపోతే వచ్చే మార్పులు : అల్పాహారం మానేసే వ్యక్తులు తమ బరువు తగ్గుతుందని, టైమ్ సేవ్ అవుతుందని అనుకుంటారు. కానీ అది వారి ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అల్పాహారం తీసుకోకపోవడం వల్ల శరీరానికి శక్తి అందదు. దీనివల్ల శరీరంలో రక్తంలో చక్కెర పరిమాణం తగ్గుతుంది. అలసటగా అనిపించడం, పనిపై దృష్టి పెట్టడంలో ఇబ్బంది పడటం జరుగుతుంది. దీంతో పాటు ఎక్కువసేపు ఆకలితో ఉండటం వల్ల జీవక్రియ మందగిస్తుంది. ఇది బరువు పెరగడానికి కారణమవుతుంది. టిఫిన్ లాభాలు : ఉదయం అల్పాహారం తీసుకోవడం వల్ల శరీరానికి రోజంతా శక్తి లభిస్తుంది. జీర్ణవ్యవస్థ కూడా బాగా పనిచేస్తుంది. అందువల్ల మీరు అల్పాహారాన్ని ఎప్పుడూ స్కిప్ చేయొద్దు. ఇది మీ శరీరానికి రోజంతా ఇంధనంగా పనిచేస్తుంది. సరైన అల్పాహారం తీసుకోవడం ద్వారా రోజంతా శక్తివంతంగా, ఫ్రెష్‌గా ఉంటారు. దీంతో పాటు అల్పాహారంలో పోషకాలు ఉన్న ఫుడ్ తినాలి. టిఫిన్‌లో ఏం తినాలి : అల్పాహారంలో పోషకమైన, శక్తితో నిండిన ఆహారాలు గంజి, ఉడికించిన గుడ్డు, పండ్లు, గింజలు, పెరుగు, తృణధాన్యాల రోటీలు తీసుకోవాలి. ఇది ఆరోగ్యకరమైన శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్, ఫైబర్‌ను అందిస్తుంది. మీకు అల్పాహారం తీసుకోవడానికి సమయం దొరకకపోతే స్మూతీస్, ఫ్రూట్ సలాడ్ లేదా గింజలను తినవచ్చు. ఇవి సులభంగా, త్వరగా జీర్ణమవుతాయి.

# వైట్ రైస్ కాకుండా మిల్లెట్స్ తింటున్నారా..?



మిల్లెట్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ వంటి జీర్ణ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతుంది. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు మిల్లెట్స్ తినడం చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని పోషకాలు శ్వాస ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మధుమేహం, అధిక బరువు సమస్య కారణంగా ప్రస్తుతం చాలామంది వైట్ రైస్ బదులు మిల్లెట్స్ తీసుకుంటున్నారు. ముఖ్యంగా మార్కెట్లో రాగులు, జొన్నలు, సామలు, కొర్రలు, సజ్జలు, అరికెలు, ఊదలకు డిమాండ్ పెరిగింది. ఆరోగ్య నిపుణులు అభిప్రాయం మేరకు ఈ మిల్లెట్స్ తినడం వల్ల బోలెడన్నీ లాభాలు ఉన్నాయని చెబుతున్నారు. మిల్లెట్స్‌లో ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే ఇవి కొంచెం తిన్నా కూడా కడుపు నిండిన ఫీలింగ్ కలుగుతుంది. దీంతో బరువు పెరగకుండా కాపాడుకోవచ్చు. మిల్లెట్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి తిన్నా కూడా రక్తంలో షుగర్ నెమ్మదిగా రిలీజ్ అవుతుంది. దీంతో డయాబెటిస్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. మిల్లెట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతాయి. అలాగే క్యాన్సర్ కణాల పెరుగుదల అడ్డుకుంటాయి. తద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. మిల్లెట్స్‌లో ఫైబర్, హెల్తీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తనాళాల్లోని చెడు కొలెస్ట్రాల్ కరిగించి గుండెకు, గుండె నుంచి అవయనాలకు రక్తప్రసరణ మెరుగుపరుస్తాయి. తద్వారా గుండె సంబంధ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. మిల్లెట్స్‌లో కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచుతాయి. దీంతో ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. మిల్లెట్స్‌లో సంపూర్ణ ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవచ్చు. మిల్లెట్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ వంటి జీర్ణ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతుంది. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు మిల్లెట్స్ తినడం చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని పోషకాలు శ్వాస ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

# శరీరంలో ఈ సంకేతాలు కనిపిస్తున్నాయా..?





మీకు ఉదయం పూట కొంచెం అలసట లేదా బలహీనత అనిపిస్తుందా? అయితే, దానిని అస్సలు విస్మరించవద్దు. కొన్నిసార్లు ఈ చిన్న సమస్యలు కూడా ఒక పెద్ద వ్యాధికి సంకేతం కావచ్చు. ఇది డయాబెటిస్ కు సంకేతం కావొచ్చు.. ఇది క్రమంగా శరీరాన్ని దెబ్బతీస్తుంది.. దాని లక్షణాలు ఉదయం మొదట కనిపించడం ప్రారంభిస్తాయి. అటువంటి పరిస్థితిలో, ఈ లక్షణాలను సకాలంలో గుర్తించి వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. చెడు జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా, మధుమేహం (డయాబెటిస్) కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధి పిల్లల నుండి పెద్దల వరకు అందరినీ బాధితులుగా మారుస్తోంది. వాస్తవానికి ఇది ఎప్పటికి నయం కానీ చాలా ప్రమాదకరమైన వ్యాధి.. ఇది క్రమంగా శరీరాన్ని బలహీనపరుస్తుంది. దీనిని సకాలంలో గుర్తించకపోతే, ఇది తీవ్రమైన రూపాన్ని తీసుకోవచ్చు. చాలా మంది పరిస్థితి మరింత దిగజారే వరకు దాని లక్షణాలను తెలుసుకోలేరు. కానీ ఉదయం వేళ శరీరంలో మధుమేహానికి సంబంధించి కొన్ని ప్రారంభ సంకేతాలు కనిపిస్తాయని మీకు తెలుసా..? డయాబెటిస్ అనేది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఒక దీర్ఘకాలిక వ్యాధి.. ఇది శరీరానికి తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేనప్పుడు లేదా ఇన్సులిన్ ను సరిగా ఉపయోగించలేనప్పుడు వస్తుంది. మీరు ప్రతి ఉదయం అలసిపోయి బలహీనంగా అనిపిస్తే.. అది ప్రమాద సంకేతం కావచ్చు. ఈ రకమైన లక్షణం మధుమేహాన్ని సూచిస్తుంది. ఉదయం శక్తి తక్కువగా ఉండటం అంటే శరీరంలో ఏదో సమస్య ఉందని అర్థం.. రక్తంలో అధిక చక్కెర స్థాయి కారణంగా, మీరు నీరసంగా లేదా శక్తి లేకపోవడంతో బాధపడవచ్చు. మీరు ఉదయం నిద్రలేవగానే చాలా దాహం వేస్తుందా..? లేదా మీ నోరు త్వరగా ఎండిపోతుందా? అయితే, ఇది కూడా రక్తంలో అధిక చక్కెరకు సంకేతం కావచ్చు. చక్కెర స్థాయి పెరిగినప్పుడు, మూత్రపిండాలు మూత్రం ద్వారా అదనపు గ్లూకోజ్‌ను బయటకు పంపడానికి ప్రయత్నిస్తాయి.. దీనివల్ల శరీరంలో నీరు లేకపోతుంది. ఉదయం నుండి మీకు చాలా దాహం వేస్తుంది.. అంతేకాకుండా మీ నోరు త్వరగా ఎండిపోవడం ప్రారంభమవుతుంది. అధిక రక్తంలో చక్కెర కళ్ళను కూడా ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర పెరగడం వల్ల, కొన్నిసార్లు మనం సరిగ్గా చూడలేము. మీకు అకస్మాత్తుగా అస్పష్టంగా కనిపించడం ప్రారంభిస్తే, మీ రక్తంలో చక్కెర స్థాయి పెరిగే అవకాశం ఉంది. అస్పష్టమైన దృష్టి సమస్యను విస్మరించడం ఆరోగ్యానికి ప్రమాదకరం. రక్తంలో అధిక చక్కెర స్థాయిలు మూత్రపిండాల ద్వారా ఎక్కువ నీటిని తొలగించడానికి కారణమవుతాయి.. దీని వలన తరచుగా మూత్ర విసర్జన జరుగుతుంది. తరచుగా మూత్ర విసర్జన చేస్తుంటే వైద్యులను సంప్రదించండి.. దీనితో పాటు, చేతులు లేదా కాళ్ళలో జలదరింపు లేదా చేతులు లేదా కాళ్ళు తిమ్మిరి.. అటువంటి లక్షణాలు డయాబెటిస్ సంకేతమని వైద్య నిపుణులు చెబుతున్నారు. మీరు ఉదయాన్నే ఈ లక్షణాలను చూస్తున్నట్లయితే.. వెంటనే వైద్యులను సంప్రదించి.. పరీక్షలు చేయించుకోండి..

## ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని పేదల నుండి రూ.20 కోట్లు కాజేసిన తెలంగాణ బీజేపీ నాయకుడు

**– డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ భూమిలో పట్టాలు చేయించిన వైనం**

**హైదరాబాద్ (భారత శక్తి)**హైదరాబాద్ మేడ్చల్ జిల్లా చెంగిచర్ల గ్రామంలోని సర్వే నంబర్ 58లో 1500 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని హిమాయత్నగర్ డివిజన్ విఠల్ వాడికి చెందిన బీజేపీ సెంట్రల్ జిల్లా సెక్రటరీ రూ.20 కోట్లు వసూలు చేసిన భాగోతం బయటపడింది. 60 గజాల స్థలం ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుండి రూ.60 వేల నుండి రూ.3 లక్షలు వసూలు చేసి పట్టాలు కూడా సదరు బీజేపీ నాయకుడు ఇచ్చాడు. అయితే పట్టాలు తీసుకుని భూమి వద్దకు వెళ్లి చూడగా, అది ప్రభుత్వ భూమి అని తెలిసి భూ పరిపాలన కార్యాలయానికి వెళ్లి అడిగితే అవన్నీ నకిలీ పట్టాలని అధికారులు తేల్చారు. దీంతో సదరు బీజేపీ నాయకుడిని నిలదీసేందుకు వెళితే సీపీఐ వాళ్లు ఇచ్చారని చెప్పండి అంటూ బుకాయించాడని, డబ్బులు తిరిగి ఇవ్వమంటే దిక్కున్న చోట చెప్పుకోండి అని బెదిరించాడని భాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీజేపీ నాయకుడిని కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని బాధితుల డిమాండ్ చేసారు.

## అన్యాయంగా బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపించారు

**హైదరాబాద్(భారత శక్తి)** బెల్ట్ షాపులు వద్దని పోరాడిన బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా జైలుకు పంపించారు. స్టేషన్ బెయిల్ వచ్చే సెక్షన్ల ప్రకారం కేసులు పెట్టినా కావాలనే అర్ధరాత్రి జడ్జి ముందు ప్రవేశపెట్టి జైలుకు పంపించారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీస్ అధికారుల మీద చర్యలు తీసుకునే వరకు పోరాడతామని అన్నారు.

## ఈద్గాల దగ్గర పోలీసు బందోబస్తు



**మెదక్(భారత శక్తి)** బక్రీద్ సందర్భంగా మెదక్ పట్టణంలోని నవాబ్పేట్, గాంధీనగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పరిశీలించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో జరగాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈద్గాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. ప్రజలు పరస్పర సహకారంతో శాంతియుతంగా బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా పండుగ జరుపుకునేలా మెదక్ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని ఎస్పీ పేర్కొన్నారు.

## సిరిపూర్లో చిరుత సంచారం

**నిజామాబాద్ (భారత శక్తి)**నిజామాబాద్ జిల్లా సిరిపూర్ లో చిరుత సంచారం కలకలం రేపింది. రాత్రి సమయంలో గ్రామంలోకి చిరుత వచ్చింది. పశువులను తినడానికి వచ్చిన చిరుత కుక్కలు గట్టిగా అరవడంతో పారిపోయింది. సీసీటీవీ ఫుటేజ్లో చిరుత కనిపించడంతో భయాందోళనలో గ్రామస్తులు వున్నారు. స్థానికుల పిర్యాదు తో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమైయారు.

## కరీంనగర్ నగరంలో బాల్య వివాహాల చట్టాలపై అవగాహన



**కరీంనగర్ (భారత శక్తి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ శివాజినగర్ అంగన్వాడీ కేంద్రం, అంబేద్కర్ భవన్ హాల్ లో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో –బాల్య వివాహ రహిత తెలంగాణ మహిళా థీమ్ తో కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే ఆడపిల్లలకు కలిగే నష్టల గురుంచి తెలియజేసారు. ఇప్పుడు ఉన్న యువత సినిమాలు లో చూపించినదే ప్రేమ అనుకుని తల్లిదండ్రులను ఎదురించడం. ప్రేమ వివాహానికి ఒప్పుకోక పోతే లేచి పోయి పెళ్లి చేసుకొని ఎందరో అమ్మాయిలు వాళ్ళ జీవితాలను నాశనం చేసుకున్నారాని అన్నారు. యువత ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాచుకొని వాటి సాధన కై కృషి చేయాలి అని అన్నారు. సీడీపీవో సబిత మాట్లాడుతూ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురుంచి చెప్పారు. బాల్య వివాహల కంప్లైంట్స్ 1098 కి కాల్ చేసి నేరుగా చెప్పా వచ్చు అన్నారు.మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ద చూపాలి మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం ఆరోగ్యాంగా ఉంటుంది అని తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుందని అన్నారు. ఖఉఅ లాలో మహిళలు హెల్త్ పరీక్షలు చె?యువకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో 27డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ , తిఇటబ బబీజూవతీలతిబనీతీ బ రేణుక . వార్డ్ ఆఫీసర్ బిష్టతితీబీఎజీశ్రీ , ఊా సునీత , అంగన్వాడీ టీచర్స్ ఖీఖూ, మహిళలు పెద్ద సంఖ్య లో హాజరు అయినారు

## కాంగ్రెస్ పార్టీపై బీసీ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్ (భారత శక్తి)** కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను సీఎం పీఠం నుండి తొలగిస్తూ కాంగ్రెస్ బీసీలకు ద్రోహం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను తొలగించడం అన్యాయం . బీసీలు పాలకులుగా ఉండటం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. రాహుల్ గాంధీ మాటలకు, ఆచరణకు ఎక్కడ పొంతన లేదని అన్నారు.రాహుల్ గాంధీ నోట పేరుకే కులగణన, ఎవరి వాటా వారి కే అన్నమాట అన్నది నీటి మూట లాంటిది. దేశంలోని 29 రాష్ట్రాల్లో కాంగ్రెస్ సీఎంలు నాలుగు రాష్ట్రాలు మాత్రమే. అందులో సిద్ధిరామయ్య తప్ప మూడు రాష్ట్రాల సీఎంలు అగ్రవర్ణాలే . నేడు కర్ణాటక సీఎం సిద్దరామయ్యను తొలగించడంతో ఇక నాలుగు రాష్ట్రాలు అగ్రకుల సీఎంలే . తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇక కర్ణాటక రాష్ట్రం కూడా కాంగ్రెస్ అగ్రకులలాకే సీఎం పీఠనీ కట్టబెడుతుంది. బిసి గొర్రె కాపరుల కుటుంబం నుండి వచ్చిన సిద్ధరామయ్యను తొలగించి బడా వ్యాపార వేత్త, అగ్రకులానికి చెందిన డీకే శివకుమార్ నియమించి కాంగ్రెస్ పార్టీ దేశంలో సామాజిక న్యాయాన్ని బొంద పెట్టింది . నాటి నెహ్రూ కాంగ్రెస్ నుండి నేటి రాహుల్ కాంగ్రెస్ వరకు బీసీలకు అన్యాయమే జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ పుట్టుక నుండి నేటి వరకు పార్టీ జాతీయ అధ్యక్షుడుగాని, ప్రధానమంత్రిగా గాని, బీసీలకు అవకాశం కల్పించలే. కర్ణాటక సిద్ధిరామయ్య తొలగించడంతోనే దేశంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమవుతుందని అన్నారు.

## మహబూబ్నగర్లో దొంగల ఘాతుకం..

**– ఏకంగా ఎస్బీఐ ఏటీఎం మిషన్నే ఎత్తుకెళ్లిన వైనం!**

**మహబూబ్నగర్ (భారత శక్తి)** తెలంగాణ చౌరస్తా సమీపంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్బీఐ (ూఃఎ) ఏటీఎం సెంటర్లోకి చొరబడి, ఏకంగా ఏటీఎం మిషన్నే ఒక వాహనంలో వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా పారిపోయారు.పక్కా ప్లాన్తో వచ్చిన దుండగులు.. లోపలికి వెళ్లగానే పవర్ సప్లై కట్ చేసి, సీసీటీవీ (అఅుఎ) కెమెరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆపై బోయపల్లి సమీపంలోని పొలాల్లోకి మిషన్ను తీసుకెళ్లి, గ్యాస్ కట్టర్తో కట్ చేసి అందులోని నగదును ఊడ్చేశారు.ఖాళీ ఏటీఎం బాక్స్ను పొలాల్లోనే వదిలేసి పరారవ్వగా.. అసలు ఎంత మొత్తంలో నగదు చోరీకి గురైందనేది బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన తర్వాతే చెప్తామని పోలీసులు వెల్లడించారు. క్లూస్ టీమ్తో దర్యాప్తు ముమ్మరం చేశారు

## రంపచోడవరం మండలం ఎర్రం పాలెం గ్రామంలో నాణ్యత లేకుండా సిసి రోడ్

**పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ కు ఫిర్యాదు ఇచ్చిన ఫలితం శూన్యం**



**రంపచోడవరం(భారత శక్తి)** ఎర్రంపాలెం గ్రామంలో రూ.3 లక్షల సీసీ రోడ్డు నాసిరకం.. వేసిన నెలకే గోతులమయం నాణ్యత పాటించలేదని గ్రామస్తుల ఆరోపణ.. రంపచోడవరం మండలం.రంపచోడవరం మండలం ఎర్రంపాలెం రామాలయానికి వెళ్లే రహదారి గ్రామంలో రూ.3 లక్షల వ్యయంతో ఇటీవల వేసిన సీసీ రోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నెల రోజులు తిరగకముందే గోతులుగా మారింది. సిమెంట్ కాంక్రీట్ ఊడిపోయి కంకర తేలుతుండటంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రం పాలెం గ్రామంలో ప్రధాన వీధిలో గ్రామ పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో సీసీ రోడ్డును గత నెలలో నిర్మించారు. అయితే కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం పనులు చేయకపోవడంతో రోడ్డు వేసిన కొద్ది రోజులకే పగుళ్లు తేలి, గుంతలు పడ్డాయి. వర్షానికి కాంక్రీట్ కొట్టుకుపోయి ఇనుప చువ్వలు కూడా బయటపడుతున్నాయని స్థానికులు తెలిపారు. "సిమెంట్, ఇసుక, కంకర నిష్పత్తి సరిగ్గా పాటించలేదు. క్యూరింగ్ కూడా చేయకుండా మామూలుగా వదిలేశారు. రోడ్డు మందం కూడా తక్కువగా వేశారు. చేతితో గోకితేనే కాంక్రీట్ ఊడి వస్తోంది. రూ.3 లక్షల ప్రజాధనం వృధా అయింది" అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం రోడ్డు వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు నడవడానికి కూడా భయపడుతున్నారని వాపోయారు.

## పిడుగురాళ్ల మహానాడులో ఎన్టీఆర్ కు ఘన నివాళులు



**పిడుగురాళ్ల (భారత శక్తి)**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి (2026) మహానాడు రెండవ రోజు సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (09 వ క్లస్టర్ ) నందు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, యువనాయకులు యరపతినేని నిఖిల్ పూలమాలలు వేసి "పేదల పెన్నిధి, సంక్షేమ సారథి అయిన మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో ప్రతిష్టాత్మకంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రెండో రోజు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేవన్ఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలు




**పిడుగురాళ్ల (భారత శక్తి)**:రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కెవన్ఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జరిగిన స్వర్గీయ ఎన్టీ రామారావు జన్మదినోత్సవ వేడుకల నందు డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు పాల్గొన్నారు. కేక్ కటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగు తెర వెలుగు, నాయకుడిగా, తెలుగు ప్రజ మీద తనదైన ముద్రవేసిన మహోన్నత మనీషి నందమూరి తారక రామారావు అని అన్నారు. సినిమాలకు, రాజకీయాలకు అతీతమైన విలక్షణమైన వ్యక్తిత్వం, దేశభక్తితో పాటు తెలుగు భాష పట్ల అవ్యాజమైన ప్రేమ కలిగిన వ్యక్తి, తెలుగు వాడినంటూ గర్వంగా చెప్పుకున్న తెలుగు రేడు ఆయన ఎన్టీఆర్ వ్యక్తిత్వం చిరస్మరణీయమైనది అన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనది అన్నారు. జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమోడు లోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ అనాధ పిల్లల వృద్ధుల అనాధాశ్రమం నందు డిగ్రీ కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బుక్స్ మరియు కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు సాధినేని నరసింహారావు, తెలగపల్లి గోపికృష్ణ, ఆలూరి ప్రసన్నకుమార్, కోనేటి ప్రసన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ చైర్మన్ గరికపాటి శంకర్రావు పాల్గొన్నారు

## జగన్ మోహన్ రెడ్డిది క్రిమినల్ మైండ్

**(భారత శక్తి)**తెలుగుదేశం పార్టీ గత 44 సంవత్సరాలుగా ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా ప్రతి ఏటా 'మహానాడు' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కోల్లు రవీంద్ర తెలిపారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిది ఒక 'క్రిమినల్ మైండ్' అని, రాష్ట్రం అభివృద్ధి చెందడం ఆయనకు ఎంతమాత్రం ఇష్టం లేదని విమర్శించారు."జగన్ మోహన్ రెడ్డి పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. ఆఖరికి మా పార్టీ కార్యాలయాలపై కూడా దాడులు చేయించారు. దీన్ని బట్టే ఆయన ఎలాంటి వినాశకర మనస్తత్వం కలిగినవారో అర్థం చేసుకోవచ్చు" అని రవీంద్ర మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి యొక్క ఈ విధ్వంసకర మనస్తత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా మరోసారి గమనించాలని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలని మంత్రి కోల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## ఏపీలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో సుపరిపాలన

- భవిష్యత్తులో పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధిలో గేమ్ చెంజర్ గా మారడం ఖాయం.
- పరిశ్రమలు ఏర్పాటు తో పుట్టపర్తి నియోజకవర్గంలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి సాధ్యం
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.
- పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా రెండవ రోజు కొనసాగిన డిజిటల్ మహానాడు
- కొత్తచెరువు లో ఎన్టీఆర్ విగ్రహానికి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ఘన నివాళులు



**పుట్టపర్తి:28 (భారత శక్తి)**పుట్టపర్తి నియోజకవర్గంలో రెండవ రోజు 11 క్లస్టర్లలో ఏర్పాటుచేసిన డిజిటల్ మహానాడు అంగరంగ వైభవంగా ఘనంగా సాగింది. ఎన్టీఆర్ 13 వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు కొత్తచెరువులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుడు జయంతి సందర్భంగా తెదేపా శ్రేణులతో కలసి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్టీఆర్ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో పలువురికి స్వీట్లు ,కేకులు ,బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతికి మార్గదర్శకులుగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. టిడిపి ఒక ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తే నేడు జాతీయ స్థాయిలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం లో సంక్షేమం ,అభివృద్ధి కొనసాగుతూ సుపరిపాలన అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో పేదలకు రెట్టింపు పింఛన్లు పంపిణీ,చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు తల్లి ఖాతాలో ,రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలో రూ.20వేలు, మహిళలకు ,దివ్యాంగులకు ఆర్టిసి బస్సుల్లో ఉచితం ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు కే దక్కుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజవర్గం లో 193 చెరువులను,2 రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. నియోజవర్గం లో అనేక భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని అందుకు పుట్టపర్తి లో లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ సంస్థ ఏర్పాటు కావడం ఎంతో గర్వకారణం అన్నారు. అదే విధంగా ఆమడ గూరు లో రూ. 51,400 కోట్లతో సుమారు 33వేల ఎకరాల్లో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుందని తెలిపారు. దీంతో నియోజవర్గంలో సుమారు 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో పుట్టపర్తి నియోజకవర్గం పరిశ్రమల హబ్ గా ఐటి హబ్ గా మారడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వ్యాప్తంగా 11 క్లస్టర్లలో ఏర్పాటుచేసిన డిజిటల్ మహానాడు పండుగకు వేలాదిమంది టిడిపి శ్రేణులు టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్ట్స్ బుక్స్

**హైదరాబాద్, (భారత శక్తి)**2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కి తగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి.మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్‌లో, బైండింగ్‌లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023-24 అకడమిక్ ఇయర్‌లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా.. 2025-26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్ట్స్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది.అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్‌పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్ట్స్ బుక్ ధర గతంలో రూ.225 ఉండగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార్హం. గతేడాది ఎల్1 గా నిలిచిన ఆర్క్‌బర్డ్ సంస్థ పేజీకి 54 పైసలు కోట్ చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్, సూపర్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేస్తామని ప్రకటించి.. ఎల్-1గా నిలిచాయి.

## వైద్య మంత్రి ఇలాకాలో ఉచిత వైద్య సేవలు

**అనంతపురం,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనిలో ఉంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రుల్లో అవసరమైన యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేస్తోంది. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి 21 రకాల యంత్రాలు, పరికరాలు మంజూరయ్యాయి. మంత్రి చొరవ తీసుకోవడంతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు, శస్త్రచికిత్సలను పైసా ఖర్చు లేకుండా ఉచితంగా చేయించుకోవచ్చని చెబుతున్నారు అధికారులు.ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. రక్తం, మూత్రం శాంపిల్స్‌ను సేకరించి తక్కువ సమయంలోనే రిపోర్ట్ అందిస్తారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ పరీక్షలు చేయొచ్చు. ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ 40 నుంచి 50 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ధర్మవరం ఆస్పత్రిలో చేసే 20 రకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయిస్తే రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. అదే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవలు పూర్తిగా ఉచితం.అలాగే ఫోర్ ప్రోబ్ అల్ట్రా సోనోగ్రామ్ విత్ కలర్ డాప్లర్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కిడ్నీలు, లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ వంటి సమస్యల్ని గుర్తిస్తుంది. ఫ్యాటీ లివర్, కిడ్నీలో రాళ్లు, గాల్ బ్లాడర్‌లో రాళలు, అపెండిసైటిస్, గుండెకు సంబంధించిన సమస్యల్ని తెలుసుకోవచ్చు. ఈ యంత్రం ద్వారా మహిళలకు గర్భసంచికి సంబందించిన సమస్యలు, గర్భిణుల్లో బిడ్డ గుండె పనితీరును తెలుసుకోవచ్చంటున్నారు.డబుల్ పంచ్ ల్యాప్రోస్కోపీ మెషిన్ కూడా అందుబాటులోకి వచ్చింది. సాధారణ శస్త్రచికిత్సలు, అపెండిక్స్ తొలగింపు, హెర్నియాను బాగు చేయడం, పిత్తాశయంలో రాళ్లు తొలగించవచ్చంటున్నారు. ఆయా ఆపరేషన్లు బయటకు చేయించుకోవాలంటే రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది.. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం పూర్తిగా ఉచితంగానే ఆపరేషన్లు చేస్తున్నారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చిన కొత్త యంత్రాలు, వైద్య పరికరాలు ప్రజలకు అందబాటులోకి వచ్చాయన్నారు సూపరిండెంటెంట్ వైద్య సేవల్ని 24 గంటలు అందిస్తున్నామని.. ఆపరేషన్లు చేస్తున్నామన్నారు.

### పుట్టపర్తికి వరుస వరాలు

మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాకు ప్రభుత్వం వరుసగా శుభవార్తలు వినిపిస్తోంది, సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో డీఆర్‌డీవో ఫిఫ్త్ జనరేషన్ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మే 15న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం. ఈ ప్లాంట్‌లో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు తయారు చేస్తారు. ఈ ప్లాంట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఆర్‌డీవోకు 600 ఎకరాల భూమిని కేటాయించింది. మరో 400 ఎకరాలను త్వరలోనే కేటాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2029 నాటికి ఈ ప్లాంట్ ప్రారంభించాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పాలసముద్రం వద్ద భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూ.500 కోట్లతో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. మడకశిరలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పుడేమో శ్రీసత్యసాయి జిల్లాలో రూ.51 వేలకోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఏపీ స్టేట్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ఆమోదం అనంతరం ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

## ఏకగ్రీవాలను అడ్డుకోండి

**గుంటూరు (భారత శక్తి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త పాచిక వేశారు. ఎక్కడ ఏకగ్రీవాలు అనే మాట లేకుండా చూడాలని చూస్తున్నారు. పొరపాటున ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు వేస్తానని హెచ్చరించారు. తద్వారా ఎక్కడ పార్టీ నేతలు తప్పించుకోకుండా ఉండేందుకు ముందుగానే వారిని కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ప్రజలు కూడా ఎక్కువగా ఏకగ్రీవాలకు మొగ్గు చూపుతారు. ఎందుకంటే స్థానికంగా రాజకీయ అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. గ్రామ పెద్దల ప్రమేయంతో చాలాచోట్ల ఏకగ్రీవాల వైపే చూస్తారు. ముఖ్యంగా పంచాయతీలకు ఏకగ్రీవాలు అనేవి సర్వసాధారణం. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏకగ్రీవం అన్న మాట వినిపించకూడదు అంటూ సొంత పార్టీ నేతలను హెచ్చరించడం బ్లాక్మెయిలింగ్ కిందకి వస్తుంది.2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలం మొత్తానికి ఒకే పదవిగా ఉండే జడ్పిటిసిలను సైతం ఏకగ్రీవం చేసుకున్నారు. పంచాయితీల గురించి చెప్పనవసరం లేదు. ఇక ఎంపీటీసీల గురించి చెప్పనవసరం లేదు. అన్ని ఏకగ్రీవాలే. ఎందుకంటే అధికార పార్టీగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను నిరసిస్తూ ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. అప్పట్లో అంతలా ఉండేది ఏకగ్రీవాల పర్వం. ఒక అధికారాన్ని చేపట్టిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వెళ్లాక ఏకగ్రీవాలు వద్దు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ రీతిలో ఏకగ్రీవాలను చేసుకుందో జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అయితే ఆయన తెలివిగా ఇప్పుడు ఆ బాధ్యతను నియోజకవర్గం అప్పగించారు. అంటే తప్పకుండా పోటీ ఉంటే పార్టీ ఓటు బ్యాంకు ఎటు వెళ్లదన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన. అయితే దీనిని ఎక్కువ మంది వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇదే మనిషి ఏకగ్రీవాలు చేయమన్నారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇది ఎక్కడి చోద్యం అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వారు ఉన్నారు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అధికార పార్టీ మహానాడు నిర్వహిస్తున్న దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడిపోతుందన్న వార్త ఉంది. అదే అజెండాతో ఈరోజు సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి.. స్థానిక సంస్థల నిర్వహణ బాధ్యతను నియోజకవర్గ ఇన్చార్జిలే తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో టికెట్ వస్తుందో లేదో? తమకే వస్తుందో లేదో? అనే ఆలోచనలో ఉన్నారు కొందరు ఇన్చార్జిలు. కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్లాంటివారు అయితే అసలు యాక్టివ్ కాలేదు. అటువంటి వారికి ఎటువంటి ఆదేశాలు ఇవ్వకుండా.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు తమను కమిట్మెంట్ చేయడం పై ఆగ్రహంగా ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు

# పొలాల్లో శాటిలైట్ నిఘా

**(భారత శక్తి)** తెలంగాణలో పెరుగుతున్న పంట వ్యర్థాల దహనం ఘటనలు, ప్రాణ నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కూలీల కొరత, పశువుల సంఖ్య తగ్గడం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడుతుండటంతో భూపాలపల్లి, నిర్మల్, హనుమకొండ జిల్లాల్లో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో శాటిలైట్ నిఘా ద్వారా పంట వ్యర్థాలు తగులబెట్టేవారిని గుర్తించి ఎన్జీటీ నిబంధనల ప్రకారం రూ.2500 నుంచి రూ.15 వేల వరకు జరిమానాలతో పాటు, ఎయిర్ యాక్ట్ కింద మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇంతకాలం ఉత్తర భారతదేశానిని, ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రానికి పరిమితమనుకున్న పంట వ్యర్థాల దహనం ముప్పు ఇప్పుడు తెలంగాణను కూడా చుట్టుముడుతోంది. వరి, మక్కజొన్న సాగు తర్వాత మిగిలిపోయే వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతుండటం రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే కొత్త పర్యావరణ, ప్రాణ నష్టాల సవాలుగా మారుతోంది. ఇటీవలి కాలంలో పలు జిల్లాల్లో పంట వ్యర్థాలను తగులబెడుతూ పలువురు రైతులు ప్రాణాలు కోల్పోవడం, వందల క్వింటాళ్ల పంట నష్టం వాటిల్లడం పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్య తీవ్రరూపం దాల్చకముందే అడ్డుకట్ట వేసేందుకు సర్కార్ నడుం బిగించింది.గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో ఈ తరహా ఘటనలు గణనీయంగా పెరిగాయి. సాధారణంగా పంజాబ్ వంటి రాష్ట్రాల్లో తదుపరి పంటకు సమయం తక్కువగా ఉండటం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడతారు. అయితే తెలంగాణలో పరిస్థితి వేరు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రం కావడం, పశువుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడమే ఇందుకు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. గతంలో ఎండు గడ్డిని పశువుల మేతగా ఉపయోగించేవారు, కానీ ఇప్పుడు పశువులు లేకపోవడంతో పొలాలను త్వరగా శుభ్రం చేసుకునేందుకు రైతులు సులభమైన మార్గంగా భావించి నిప్పు పెడుతున్నారు. ఇప్పటికే ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రమైంది. ఖమ్మం జిల్లా పాథర్లపాడులో ఇలా పెట్టిన మంటలు పక్క పొలాలకు వ్యాపించి వందల క్వింటాళ్ల దిగుబడి బూడిదైంది.పంట వ్యర్థాల దహనం కేవలం పర్యావరణానికే కాదు, రైతుల ప్రాణాలకూ ముప్పుగా మారింది. మే 24న భూపాలపల్లి జిల్లాలో చంద్రమౌళి అనే రైతు వ్యర్థాలను తగులబెడుతూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఆ ఘోరాన్ని కళ్లారా చూసిన ఆయన భార్య భాగ్యమ్మ గుండె ఆగి అక్కడికక్కడే మృతి చెందింది.

మే 13న నిర్మల్ జిల్లాలో మంద గంగన్న అనే రైతు మక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టగా.. ఆ మంటలు పక్కనే ఉన్న వరి పొలానికి వ్యాపించాయి. వాటిని ఆర్పే క్రమంలో ఆయన కాలిబూడిదయ్యాడు. మే 10న హనుమకొండ జిల్లాలో జి. జయపాల్ రెడ్డి అనే వృద్ధ రైతు వ్యర్థాలకు నిప్పు పెడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మంటల్లో కాలి ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఉదంతాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం రైతులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట వ్యర్థాల దహనాన్ని కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ సంస్థలు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాయని ఇది గాలి నాణ్యతతో పాటు భూసారాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఇకపై పొలాల్లో మంటలు పెట్టే రైతులను గుర్తించేందుకు శాటిలైట్ ఇమేజరీ ఉపయోగించబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.నిబంధనలు ఉల్లంఘిస్తే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, ఎయిర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే ఎన్జీటీ నిబంధనల ప్రకారం పర్యావరణ పరిహారం కింద జరిమానాలు విధిస్తారు. 2 ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ2500, 2 నుంచి 5 ఎకరాల లోపు ఉన్నవారికి రూ5 వేలు, 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు ప్రతి ఘటనకు రూ15 వేల వరకు జరిమానా విధించనున్నారు. గ్రామాల్లో తక్షణమే అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

## వ్యక్తిపై దుండగుల దాడి

**జనగామ (భారత శక్తి)** పాలకుర్తి మండలం కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో, శాతాపురం గ్రామనికి చెందిన తీగల ధర్మారావు పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్ర రక్తస్రావానికి గురైన ధర్మారావును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కడుపులో, వీపులో, చేయి పై కత్తిపోట్లు పొడిచిన గుర్తు తెలియని వ్యక్తులు. ధర్మారావు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పోలీసులు దుండగుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

## వానలు రాకముందే పూడికలు తీయండి

**మేడ్చల్(భారత శక్తి)** సరూర్నగర్ చెరువు పూడికలు తీస్తామన్నారు. చెరువును సగం ఎండబెట్టారు. చెరువు ప్రక్షాళన చేస్తాము అని అన్నారు అధికారులు, ఎల్బీ కాంగ్రెస్ గొప్పలు చెప్పారు. కానీ ఏమీ చేయలేదని బీజేపీ నేతలు ఆరోపించారు, ఎండాకాలం ముగిసిపోయింది. వర్షాకాలం వచ్చేస్తోంది. ఇప్పటికీ డ్రైనేజీ నీళ్లు అలాగే ఉన్నాయి. పూడికలు కూడా పూర్తిగా తీయలేదు. రేపు భారీ వర్షాలు పడితే ఆ నీళ్లు ఎక్కడికి వెళ్తాయి..? మళ్లీ చెరువులోకే పంపిస్తారా అని ప్రశ్నించారు. పూడికలు తీశాం” అని కాగితాల మీద పనులు చూపించి బిల్లులు డ్రా చేసుకోవడానికే ఈ డ్రామాలు చేస్తున్నారు. ప్రజల డబ్బుతో చేసే పనులు. ప్రజల ప్రాణాలను కాపాడాలి గానీ, ఫైళ్లలో ఫోటోలు పెట్టి కమిషన్లు కొట్టడానికి కాదు. ఇప్పటికైనా అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొనాలి.ప్రజాధనాన్ని వృథా చేస్తూ, ప్రజల భద్రతను గాలికొదిలేస్తే ఒక రోజు ప్రజలే నిలదీస్తారు. జీతాలు తీసుకుంటే బాధ్యత కూడా తీసుకోండి. తక్షణమే నాళాలు, కుంటలు, చెరువులలో ఉన్న పూడికలను పూర్తిగా తొలగించండి. లేకపోతే నిర్లక్ష్యంతో జరిగే ప్రతి నష్టం? ప్రతి ప్రాణ హానికి బాధ్యత మీదేనని అన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ వర్ధంతి వేడుకలు

**(భారత శక్తి)** స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ వర్ధంతి సందర్భంగా సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ అధ్యక్షులు కుమార్ చౌదరి, వైస్ ప్రెసిడెంట్ ఎన్.కే. విజయ్ రాజ్, మరియు నాయకులు ఆనంద్, శివ, గోపాల కృష్ణ చౌదరి తదితరులు కలిసి యూసఫ్ గూడ లోని ఎల్లారెడ్డి గూడ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన ఘనమైన పరిపాలన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అయితే, ఇటీవల తెలంగాణకు చెందిన కొందరు నాయకులు ఎన్టీఆర్ గారిపై, ఆయన విగ్రహ ఆవిష్కరణపై చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి తీవ్రంగా ఖండిస్తోందని హెచ్చరించారు.

## ఫైనాన్షియర్లు నన్ను వేధించినట్లు ఇతరులను వేధించొద్దు

**- భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చి తాను ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి**

**- ఫైనాన్సియర్ల వేధింపులే కారణమంటూ వాట్సాప్ స్టేటస్**

**వనపర్తి (భారత శక్తి)** ఖిల్లా ఘనపురం మండల సల్కిలాపురం గ్రామ శివారులోని 52 ఎకరాల మామిడితోటను గత ఆరేళ్లుగా లీజుకు తీసుకుంటున్న మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు గ్రామానికి చెందిన గంగల నర్సింహులు(40) మామిడి తోట సాగు రుణం తీసుకున్నాడు. ఆరేళ్లుగా చేసిన రూ.60 లక్షల అప్పు, వడ్డీతో సహా రూ.1.20 కోట్లకు చేరగా, ఊర్లో ఉన్న ఇంటిపై రుణం తీసుకుని కొంత అప్పు తీర్చాడు.

మిగతా అప్పు తీర్చాలని ఫైనాన్షియర్లు వేధిస్తున్నారని, ఇంటికి నోటీస్ అంటించి బంగారం తీసుకెళ్లారని, తనను వేధించినట్లు ఇంకెవరినీ వేధించొద్దని వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. వరుసకు అల్లుడైన వ్యక్తికి ఫోన్ చేసి భార్య ఎల్లమ్మ(33)ను ఉరి వేసి చంపేశానని, పిల్లలు(సాయినిహాల్(15), సాహితీశ్రీ(12))లను సంపులో పడేశానని, తాను కూడా చనిపోతున్నానని చెప్పాడు. ఉదయం మామిడి తోటకు వచ్చి చూడగా, విగత జీవులుగా పడి ఉన్న కుటుంబాన్ని చూసి బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నర్సింహులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

**విజయవాడ (భారత శక్తి)**గురువారం నాడు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గంటకు 40 నుండి 50 కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం వుంది.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వర్షం పడే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకూడదని హెచ్చరించింది.

## తెలంగాణలో ఆంధ్రా ఆటలు సాగావు

**హైదరాబాద్ (భారత శక్తి)** పవన్ కళ్యాణ్, చంద్రబాబులకు సిగ్గు శరం ఉంటే హైదరాబాద్ వదిలి అమరావతికి వెళ్లిపోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యేల్ అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేసేందుకు ఆంధ్రా పోలీసులు వస్తారా? ఇంకెక్కడి ఆంధ్రా.. గల్లా పట్టి నూకితే ఎప్పుడో పారిపోయారనిఅ న్నారు. మీ అయ్య జాగీరు ఉందా హైదరాబాద్లో? ఇక్కడ ఎందుకు ఉంటున్నారు? బతకమని వదిలేస్తే తెలంగాణను ఆగం చేద్దాం అని చూస్తావా చంద్రబాబు? నీ ఏడుపు ఏదో అమరావతిలో ఏడువు, లేకపోతే కుప్పంలో ఏడువు..అంతేకాని మా దగ్గర నీ ఆటలు సాగవని అన్నారు.

## రెండు బస్సులు ఢీ..ఒకరు మృతి

**మహబూబ్నగర్ (భారత శక్తి)** జడ్చర్ల వద్ద 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి తిరుపతి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఒక డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతదేహం మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు తిరుపతికి చెందిన అశోక్ రెడ్డి గా గుర్తించారు.

## వృద్ధురాలి అనుమానాస్పద మృతి మిస్టరీని 24 గంటల్లో ఛేదించిన కశింకోట పోలీసులు

**- బంధువురాలే హంతకురాలు**



**కశింకోట (భారత శక్తి)** కశింకోట గ్రామంలో సంచలనం సృష్టించిన వృద్ధురాలు దమ్ము నాగమ్మ (85) హత్య కేసు మిస్టరీని కశింకోట పోలీసులు అత్యంత సమర్థవంతంగా, కేవలం 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. అప్పుల బాధతో బంగారు నగ ల కోసం సొంత బంధువురాలే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసు విచారణలో తేలింది. నిందితురాలిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.నిందితురాలు సిమ్మ సత్య మృతురాలికి బంధువే. సిమ్మ సత్య అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. మృతురాలి వద్ద ఉన్న బంగారు చెవిదిద్దులను ఎలాగైనా దక్కించుకోవాలని పథకం వేసింది. ఈ నెల 16-05-2026 రాత్రి మృతురాలి ఇంటికి వెళ్లి, మొదట ఆ నగలను తాకట్టు పెట్టుకోవడానికి ఇవ్వమని అడిగింది. నాగమ్మ నిరాకరించడంతో, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుని, మంచంపై టీవీ చూస్తున్న నాగమ్మ మెడకు తను ధరించిన చున్నీతో గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. హత్య అనంతరం ఉదయం నాగమ్మ చెవులకున్న బంగారు దిద్దులను దొంగిలించి, కొప్పాక గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద రూ.50,000/-లకు తాకట్టు పెట్టింది. హత్యకు ఉపయోగించిన చున్నీని కశింకోట కాలువలో పారేసింది. సాంకేతిక ఆధారాలు, నమ్మకమైన సమాచారంతో అనుమానితురాలైన సిమ్మ సత్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించింది.

## బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్ (భారత శక్తి)** బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబ్నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి. జానకి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అలాగే జిల్లాలోని అన్ని ఈద్గా ప్రాంగణాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదరులు, సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగను సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బందోబస్త్ లో అదనపు ఎస్పి ఔః రత్నం, ఒఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆూఖ వెంకటేశ్వర్లు, ఆఅఖీః ఆూఖ రమణా రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ాః ఇన్స్పెక్టర్ మోతిరాం, అఆూ తినిబజూవఇఃబినీతీ కృష్ణా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈద్గాలను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్




**వరంగల్ (భారత శక్తి)**బక్రీద్ పండుగను పురస్కరించుకొని హన్మకొండలోని బొక్కలగడ్డ ఈద్గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ గురువారం సందర్శించి పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ప్రార్థనలు సజావుగా జరిగేందుకు అధికారులు చేపట్టినచర్యలపై సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హన్మకొండ నర్సింహారావు అడిగి తెలుసుకున్నారు.

## ఓటీటీలోకి వచ్చిన ధనుష్ కొత్త సినిమా




ధనుష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కర' ఓటీటీలోకి వచ్చేసింది. నేటి నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. 1990ల కాలం నేపథ్యంలో బ్యాంకుల అప్పులు, వాటిని తీర్చలేక ఒక వ్యక్తి నేర ప్రపంచంలోకి అడుగుపెట్టే పరిస్థితులను ఈ చిత్రంలో వాస్తవికంగా చూపించే ప్రయత్నం చేశారు.

ఈ చిత్రం 2026 ఏప్రిల్ 30న విడదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.40 కోట్ల వసూళ్లు సాధించింది. ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీతో పాటు పలు భాషల్లో ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించారు. సీనియర్ నటుడు కేఎస్ రవికుమార్ కీలకపాత్రలో మెప్పించారు. ఈ చిత్రానికి జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. తన సంగీతంతో 1990ల నాటి వాతావరణాన్ని అద్భుతంగా తెరపై కనిపించేలా చేశారు.

## సీనియర్ ఎన్టీఆర్ జయంతి .. ఘాట్ వద్ద నివాళులు అర్పించిన జూనియర్ ఎన్టీఆర్

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి, నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నేడు ఉదయం ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకుని తన తాతయ్య ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. తెల్లవారుజామునే ఘాట్ వద్దకు చేరుకున్న తారక్ పూలమాల వేసి, నివాళులు సమర్పించి కొద్దిసేపు అక్కడే మౌనంగా నిలబడి తాతయ్య జ్ఞాపకాలను స్మరించుకున్నారు.జూనియర్ ఎన్టీఆర్ రాకతో ఘాట్ పరిసరాలు అభిమానులతో కిక్కిరిశాయి. తారక్‌ను చూడాలని అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. "అన్నా.. అన్నా" అంటూ అభిమానులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం మొత్తం సందడిగా మారింది. అభిమానులకు చేతులు ఊపుతూ అభివాదం చేసిన తారక్, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట భద్రతా సిబ్బంది భారీగా మోహరించారు.నందమూరి కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు, సినీ ప్రముఖులు కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని మహానేతకు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహానుభావుడని పలువురు కొనియాడారు. సినీ రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ప్రతి ఏడాది ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్దకు వచ్చి నివాళులు అర్పించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. తాతయ్యపై తనకున్న అపారమైన గౌరవాన్ని తారక్ పలుమార్లు బహిరంగంగా వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ మహానేతను స్మరించుకుంటున్నారు. సోషల్ మీడియాలో కూడా ఎన్టీఆర్‌కు సంబంధించిన అరుదైన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతూ అభిమానుల్లో భావోద్వేగాన్ని కలిగిస్తున్నాయి.





## భాగ్యశ్రీ బోర్సే గురించి అలాగే అనుకుంటున్నారు మరి!

భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.



## 'డెర్బీ' మూవీ రివ్యూ!




కాలేజ్ నేపథ్యంలోని కథలు యూత్ ను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. క్యాంపస్ కథలతో వచ్చిన చాలా సినిమాలు విజయాలను సాధించాయి. అలాంటి ఒక నేపథ్యంలో వచ్చిన సినిమానే 'డెర్బీ'. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోకి అడుగుపెట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు తెలుగులోను ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అర్జున్ .. సందీప్ .. ష్వాన్ .. ఉస్తాద్ .. యూసఫ్ .. మరియా స్నేహితులుగా ఉంటారు. అందరూ కూడా ఒకే కాలేజ్ లో చేరతారు. అర్జున్ తల్లి విదేశాలలో ఉంటుంది. అందువలన అర్జున్ కి సంబంధించిన అన్ని విషయాలను తండ్రి దినకరన్ చూసుకుంటూ ఉంటాడు. ఇక యూసఫ్ విషయానికి వస్తే, తండ్రి లేని యూసఫ్ ను ఫారిన్ లో ఉంటున్న మేనమామ దగ్గరికి పంపించాలనే ఉద్దేశంతో తల్లి ఉంటుంది. ఇక మిగతా స్నేహితులంతా కూడా మధ్యతరగతి నుంచి వచ్చినవారే. కాలేజ్ లైఫ్ ను కలర్ఫుల్ గా గడపొచ్చు .. ఎంజాయ్ చేయవచ్చని భావించిన అర్జున్ టీమ్ కి, తొలిరోజునే నిరాశ ఎదురవుతుంది. కాలేజ్ లో థర్డ్ ఇయర్ గ్యాంగ్ కి లీడర్ గా 'రియాజ్' ఉంటాడు. సెకండియర్ గ్యాంగ్ కి 'అమల్' నాయకుడిగా ఉంటాడు. ఈ రెండు గ్రూపుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉంటాయి. ఫ్రెషర్స్ గా వచ్చిన అర్జున్ బ్యాచ్ వాళ్లు సీనియర్స్ ను చూసి కంగారు పడిపోతారు. కాలేజ్ లో తాము అనుకున్నట్టుగా రోజులు గడవడం కష్టమేనని వాళ్లకి అర్థమైపోతుంది. ఫస్టు ఇయర్ వాళ్లను సీనియర్స్ ప్రతి విషయంలో ఎవైడ్ చేస్తుంటారు. క్లాస్ రూమ్స్ .. క్యాంపస్ .. క్యాంటీన్ .. ప్లే గ్రౌండ్ .. ఇలా అన్ని చోట్లా ఫస్టు ఇయర్ వాళ్లను అవమానించడమే పనిగా పెట్టుకుంటారు. సీనియర్ అయిన శ్రేయతో అర్జున్ చనువుగా ఉండటం, వాళ్ల ఆగ్రహానికి మరింత కారణమవుతుంది. అప్పుడు అమల్ గ్యాంగ్ ఏం చేస్తుంది? వాళ్లను అర్జున్ టీమ్ ఎలా ఎదుర్కొంటుంది? కాలేజ్ క్యాంపస్ వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.కాలేజ్ లో తమ పిల్లలు బాగా చదువుకోవాలనీ, కాలేజ్ నుంచి బయటికి రాగానే మంచి జాబ్ సంపాదించి లైఫ్ లో సెటిల్ కావాలని పేరెంట్స్ ఆశపడుతూ ఉంటారు. కాలేజ్ లో ఎలాంటి గొడవలు లేకుండా తమ పిల్లలు బయటపడాలని భావిస్తూ ఉంటారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతూ ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో చదువుకోవడానికి వచ్చిన స్టూడెంట్స్ మధ్య ఇక్కడ ఎలాంటి వార్ నడుస్తూ ఉంటుందనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకున్నారు. కాలేజ్ లలో సీనియర్స్ .. జూనియర్స్ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి. ర్యాగింగ్ అనేది వాళ్లను ఎలా విడదీస్తుంది. సీనియర్స్ ను యాజమాన్యం ఎందుకు నియంత్రించలేకపోతోంది అనే విషయాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. ఆవేశాల కారణంగా స్టూడెంట్స్ భవిష్యత్తు ఎలా ప్రశ్నార్థకంగా మారుతుందనేది ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. అలాగే స్టూడెంట్స్ కుటుంబాల వైపు నుంచి ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడానికి ట్రై చేయడం కనిపిస్తుంది. కాలేజ్ వాతావరణం ఎలా ఉంటుంది .. ఆ క్యాంపస్ లోకి అడుగుపెట్టిన తరువాత స్టూడెంట్స్ ప్రవర్తన ఎలా ఉంటుందనేది సహజంగా ఆవిష్కరించడంలో దర్శకుడు కొంతవరకూ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. లవ్ .. ఫ్రెండ్షిప్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ లో, కేవలం ఫ్రెండ్షిప్ ను మాత్రమే కాస్త హైలైట్ చేయడం కనిపిస్తుంది. మిగతా అంశాలు అంతగా ప్రభావితం చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది కాలేజ్ కథల్లో లవ్ .. రొమాన్స్ అనే అంశాలాను టచ్ చేయకుండా వదలరు. యూత్ లో ఎక్కువగా ఆ అంశాలపై ఫోకస్ చేస్తూనే థియేటర్స్ కి వస్తారు. అయితే ఈ సినిమా విషయంలో ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. స్టూడెంట్స్ గొడవలు .. కొట్లాటలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. ఆ గొడవల వెనుక బలమైన ఎమోషన్ లేకపోవడం మరో మైనస్ గా అనిపిస్తుంది. కథ ఒక ఫ్లోలో పరిగెత్తకుండా ఎటెటో వెళుతుంది. అనవసరమైన సన్నివేశాల దిశగా మలుపులు తీసుకుంటుంది. కాలేజ్ క్యాంపస్ లోకి వెహికల్స్ ను అనుమతించమని అంటే, హెలికాప్టర్ లో రావడం వంటి సన్నివేశాలు కాస్త అతిగా అనిపిస్తాయి. అమల్ గ్యాంగ్ అరాచకం చాలదన్నట్టుగా, హకీమ్ గ్యాంగ్ ను రంగంలోకి దింపడం కూడా అలాంటిదే. స్టూడెంట్స్ గా చేసిన వాళ్లంతా బాగానే చేశారు. కాకపోతే ఎమోషన్స్ వైపు నుంచి వాళ్ల పాత్రలను ఎక్కువగా డిజైన్ చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది. కథాకథనాలు కొత్తగా .. గొప్పగా అనిపించవు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం . ఎడిటింగ్ ఓ మాదిరిగా ఉన్నాయంతే. యూత్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన కంటెంట్ అయినప్పటికీ, యూత్ ను ఆకట్టుకోలేకపోయిందనే చెప్పాలి.

## ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నారు. ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి.

## సూర్య ఈ సారి ఏం చేస్తాడో చూడాలి మరి!

సూర్య తన కెరియర్ మొదలుపెట్టిన దగ్గర నుంచి ఎక్కడా పెద్దగా గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. అయితే ఆయనకి సరైన హిట్ పడి చాలా కాలమే అయింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన వచ్చిన 'వీరభద్రుడు' (కరుప్పు) కూడా తెలుగులో ఆశించిన స్థాయిలో ఆడలేదు. తమిళనాడులో మాత్రం బాగానే ఆడిందనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆయన తాజా చిత్రం నుంచి ఒక అప్ డేట్ వచ్చింది. తనకి తెలుగు దర్శకులతో కలిసి పనిచేయాలని ఉందనీ, నేరుగా తెలుగు సినిమా చేయాలని ఉందని సూర్య ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నాడు. ఇన్నాళ్లకి ఆయన కల నిజమైందని చెప్పచ్చు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. రీసెంటుగా ఈ సినిమా నుంచి వదిలిన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమాను ఆగస్టు 14వ తేదీన విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. ఒక 40 ఏళ్ల యువకుడికీ .. 20 ఏళ్ల యువతికి మధ్య నడిచే ప్రేమకథ ఈ సినిమాలో ప్రధానమైనదిగా ప్రేక్షకులను అలరిస్తుందని చెబుతున్నారు. మామితా బైజు కథానాయికగా నటించిన ఈ సినిమాలో, రాధికా శరత్ కుమార్ .. రవీనా టాండన్ కీలకమైన పాత్రలను పోషించారు. సితార బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాను, తెలుగు .. తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. చాలాకాలంగా సూర్య వెయిట్ చేస్తున్న భారీ హిట్, ఈ సినిమాతోనైనా పడుతుందేమో చూడాలి



## ప్రతి ఒక్కరూ చూడవలసిన గ్రిప్పింగ్ థ్రిల్లర్ ఇది!



డబ్బుంటే ఆశలు నెరవేర్చుకోవచ్చు .. కలలు నిజం చేసుకోవచ్చు .. కోరుకున్నట్లుగా బ్రతకొచ్చు. అయితే డబ్బుంటే కోరుకున్న సర్టిఫికెట్ ను సంపాదించుకోవచ్చు .. మనసు పడిన జాబ్ ను పొందవచ్చు అనేది చాలా తక్కువ మందికి తెలుసు. అదెలా సాధ్యమనేది చాటిచెబుతున్న సిరీస్ 'ఎగ్జామ్'. సర్గుణం దర్శకత్వం వహించిన ఈ సిరీస్, అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. దుషారా విజయన్ - అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కాసులుంటే చాలు కష్టపడి చదవాల్సిన పనిలేదు. కష్టపడిన వాళ్లందరినీ దాటుకుంటూ వెళ్లి, వాళ్ల కళ్లముందరే కోరుకున్న సీట్లో కూర్చోవచ్చు. పుస్తకాలలో ఏముందో తెలుసుకోవడం కాదు, ఇక్కడ జరుగుతున్న దందాపై కూడా ఒక లుక్కేయమని చెప్పే సిరీస్ ఇది. అవకాశం లేదనీ .. అదృష్టం కలిసి రాలేదని కొంతమంది స్టూడెంట్స్ పక్కదారి పడుతుంటారు. అవకాశం లేకపోయినా .. అదృష్టం దరిదాపులలో కనిపించకపోయినా మరికొంతమంది అనుకున్నది సాధిస్తారు. అలాంటి రెండు పాత్రల చుట్టూ తిరిగే ఈ కథ ఎమోషనల్ గా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. బలమైన కథాకథనాలతో .. బలమైన పాత్రలతో నడిచే ఈ సిరీస్, ప్రతి ఒక్కరూ చూసితీరవలసిన సిరీస్ అని చెప్పచ్చు.

భారత శక్తి VOICE OF INDIAN



# కర్ణాటకలో రెండో కృష్ణుడు...

**బెంగళూరు,(భారత శక్తి)** అధికారంలోకి రాకముందు కుర్చీల కోసం కొట్లాట.. అధికారం వచ్చిన తర్వాత పదవుల కోసం కొట్లాట.. కాంగ్రెస్ పార్టీలో రాజకీయాల గురించి ఢిల్లీకి సర్కిల్స్ ప్రాంతంలో బాగా పేరుపొందిన సామెత ఇది. ఈ సామెత సంవత్సరాల కాలం నాటిదైనప్పటికీ.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉందంటే కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. దేశమంతా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో మాత్రం అనుకూలమైన వాతావరణం కొనసాగుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీలో భాగస్వామ్య పక్షంగా ఉంది.ఉన్న అధికారాన్ని సుస్థిరం చేసుకొని.. దేశవ్యాప్తంగా అధికారాన్ని దక్కించుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ చేయాల్సి ఉండగా.. దక్షిణాది రాష్ట్రాలలో అందుకు భిన్నంగా సాగుతోంది. ముఖ్యంగా పదవుల కోసం నాయకుల మధ్య జరుగుతున్న పోరాటాలు ప్రజల్లో చులకన భావాన్ని కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రధానమైన కన్నడ సీమలో ప్రస్తుతం సీఎం మారతారు అనే చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్నాయి.. కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఈనెల 30న ప్రమాణస్వీకారం చేస్తారని కూడా తెలుస్తోంది.ముఖ్యమంత్రి స్థానం కోసం శివకుమార్ మధ్య.. సిద్ధరామయ్య మధ్య పోటీ ఎప్పటినుంచో సాగుతూనే ఉంది. ఇద్దరు కూడా బలమైన నాయకులు కావడంతో ఎవరి మనసు నొప్పించకుండా ఉండేందుకు అధిష్టానం నాయకత్వ మార్పు ప్రక్రియను చేపడుతున్నట్లు తెలుస్తోంది.. గతంలో సీఎం స్థానం కోసం శివకుమార్ అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఈ పంచాయతీ ఢిల్లీ దాకా కూడా వెళ్ళింది. అధిష్టానం మధ్యలో జోక్యం చేసుకోవడంతో శివకుమార్ కాస్త వెనక్కి తగ్గారు. అప్పట్లోనే అధిష్టానం శివకుమార్ కు కొంత వ్యవధి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఆ వ్యవధి ముగిసిపోవడం శివకుమార్ అధిష్టానం ముందు ప్రస్తావించినట్టు తెలుస్తోంది. నీతో నాయకత్వ మార్పుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.అధిష్టానం చెప్పినట్టు సిద్ధరామయ్య నడుచుకుంటారని కర్ణాటక మీడియాలో వార్తలు వస్తున్నాయి. గురువారం సిద్ధరామయ్య తన మంత్రివర్గంలో ఉన్న వ్యక్తులకు అల్పాహార విందు ఇస్తారని.. ఆ తర్వాత లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు రాజీనామా పత్రం సమర్పిస్తారని తెలుస్తోంది.. గురువారం ఉదయాన్నే ఢిల్లీ నుంచి సిద్ధరామయ్య ఇంటికి వస్తారని.. ఆ తర్వాత వారిద్దరూ మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేసులో ఉన్న వ్యక్తులలో డీకే శివకుమార్ తో పాటు పరమేశ్వర పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు తాను రాజీనామా చేసిన తర్వాత.. కర్ణాటక రాష్ట్రంలో బలంగా ఉన్న అహింద వర్గాలకే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని సిద్ధరామయ్య చెప్పినట్టు తెలుస్తుంది. ఒకవేళ దీనికి గనక అధిష్టానం ఓకే చెబితే అప్పుడు పరమేశ్వర ముఖ్యమంత్రి అవుతారు. పరమేశ్వర ప్రస్తుతం హోం మంత్రిగా ఉన్నారు. ఈయన దళిత సామాజిక వర్గానికి చెందినవారు. 2023లో పార్టీ అధిష్టానం రెండున్నర సంవత్సరాలు మాత్రమే సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉంటారని డీకే శివకుమార్ తో చెప్పింది. అందువల్ల ఇప్పుడు ముఖ్యమంత్రి మార్పు జరుగుతోందని తెలుస్తోంది.

# మారుతొన్న అస్సామ్..భాషా సామరస్యం

**గౌహతి,(భారత శక్తి)** ఈశాన్య రాష్ట్రం అస్సాం ఎప్పుడూ భాషా సమస్యలకు పర్యాయపదంగా నిలిచింది. బెంగాలీ?అస్సామియా ఘర్షణలు, జనాభా లెక్కల సమయంలో జరిగిన అల్లర్లు, బోడోలాండ్ ఉద్యమం ? ఈ అన్నీ భాషా గుర్తింపు కోసం జరిగిన దీర్ఘకాలిక పోరాటాలు. ఒక్క భాషను ఆధిపత్యం వహింపజేయాలనే ప్రయత్నాలు రాష్ట్రాన్ని రక్తసిక్తం చేశాయి. కానీ 2026 మే 26న జరిగిన ఒక ఘటన ఆ చరిత్రను పూర్తిగా మార్చేసింది. అస్సాం అసెంబ్లీలో 9 భాషల్లో పదవీ ప్రమాణ స్వీకారం జరగడం దేశంలోనే అపూర్వమైన సంఘటన. ఇది కేవలం ఒక ఆడంబరం కాదు.. భాషా వైవిధ్యాన్ని సమస్యగా కాకుండా బలంగా మార్చే రాజకీయ పరిపక్వత.16వ అస్సాం అసెంబ్లీలోని 124 మంది ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. వారు తొమ్మిది భాషల్లో ప్రమాణం చేయడం అస్సాం అసెంబ్లీ చరిత్రలో మొదటిసారి 124 మందిలో 75 మంది అస్సామియా భాషలో ప్రమాణం చేశారు. ఇక 17 మంది సంస్కృతంలో ప్రమాణం చేసి చరిత్ర సృష్టించారు. బోడో, అహోం, టీ కమ్యూనిటీ, ప్లెయిన్స్ సముదాయాల నుంచి వచ్చిన నాయకులు ఈ ప్రాచీన భాషను ఎంచుకున్నారు. ఇక తొమ్మిది మంది బెంగాలీలో ఎనిమిది మంది బోడో భాషలో ప్రాణం చేశారు. రభా, కర్బి, రాజ్‌బంశీ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మిగతావారు ప్రమాణస్వీకారం చేశారు.ప్రో?టెం స్పీకర్ చంద్రమోహన్ పటోవరి ప్రమాణం చేయించగా, సీఎం హిమంత బిశ్వా సర్మా అస్సామియాలో ప్రమాణం చేశారు. రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో లేని భాషలైన రాభా, కర్బి, రాజ్‌బంశీలను కూడా అనుమతించడం ఈ ఘటనను మరింత ప్రత్యేకం చేసింది.గతంలో భాషా ఉద్యమాలు విభజనను పెంపొందించాయి. బెంగాలీలపై అస్సామియా జాతీయవాదం, బోడోల గిరిజన హక్కుల పోరాటం ? ఇవన్నీ రాష్ట్ర స్థిరత్వానికి భంగం కలిగించాయి. కానీ ఈసారి ప్రభుత్వం (ముఖ్యంగా హిమంత సర్మా నాయకత్వం) భిన్న భాషా సముదాయాలను గౌరవించడం ద్వారా సమావేశక రాజకీయాలకు ఉదాహరణ చూపించింది. సంస్కృతం వైపు మలుపు మరింత లోతైన సందేశం ఇస్తుంది. ఇది భారతీయ సాంస్కృతిక మూలాలను గౌరవించడమే కాకుండా, వివిధ తెగల మధ్య వంతెనగా మారింది. బోడో ఎమ్మెల్యే సంస్కృతంలో ప్రమాణం చేయడం భాషా గుర్తింపు యుద్ధం నుంచి సాంస్కృతిక ఐక్యత వైపు మారిన మనస్తత్వాన్ని చూపిస్తుందిరాష్ట్రంలో 47 వరకు భాషలు మాట్లాడతారు. తెలుగు రాష్ట్రాల్లో ఏక భాషా ఆధిపత్యం ఉన్నప్పటికీ.. అస్సాం వైవిధ్యాన్ని ఆలింగనం చేసుకోవడం ద్వారా బలాన్ని పొందుతోంది. ఇది "భిన్నత్వంలో ఏకత్వం" అనే భారతీయ తత్వానికి జీవంత కాడిన ఉదాహరణ.సవాళ్లు మరియు ఆశలుఈ ఘటన సాంస్కృతిక సంరక్షకులకు బలమైన సంకేతం. చిన్న భాషలు (రాభా, కర్బి వంటివి) గుర్తింపు పొందడం వల్ల గిరిజన సముదాయాల్లో విశ్వాసం పెరుగుతుంది. అయితే, ఇది కేవలం ప్రమాణ స్వీకారంతో ఆగకూడదు. విద్య, పరిపాలన, ఆర్థిక అభివృద్ధిలో కూడా ఈ వైవిధ్యాన్ని ప్రోత్సహించాలి. అస్సాం ఇకపై భాషా సంఘర్షణల రాష్ట్రంగా కాకుండా, భాషా సామరస్యంకు దేశానికి ఆదర్శంగా నిలవాలి. హిమంత బిశ్వా సర్మా ప్రభుత్వం ఈ దిశగా తీసుకున్న మొదటి అడుగు చాలా ముఖ్యమైనది.భాషలు మనల్ని విభజించే ఆయుధాలు కాకుండా, ఐక్యం చేసే వంతెనలుగా మారాలి. అస్సాం అసెంబ్లీలో జరిగిన ఈ చారిత్రక ఘటన ఆ దిశలో ఒక మహత్తర మలుపు. ఇది రాష్ట్రానికి మాత్రమే కాదు, మొత్తం దేశానికి ఒక పెద్ద సందేశం ? వైవిధ్యాన్ని గౌరవిస్తేనే నిజమైన ఐక్యత సాధ్యమవుతుంది. అస్సాం ఈ మార్గంలో ముందుకు సాగాలని ఆశిద్దాం.

# తృణమూల్ ఇక చరిత్రేనా...

**కోల్ కత్తా,(భారత శక్తి)** పశ్చిమ బెంగాల్‌ను 15 ఏళ్లు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించారు మమతా బెనర్జీ. అక్కడ కమ్యూనిస్టు పాలకుల రికార్డును చెరిపేయాలని ప్రయత్నించారు. కానీ అమె అనుసరించిన విధానాలు, భారత వ్యతిరేక ధోరణి, వలసవాదుల అనుకూల వైఖరి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మమతతోపాటు, తృణమూల్ కాంగ్రెస్‌ను బెంగాలీలు చిత్తుగా ఓడించారు. అధికారం కోల్పోవడంతో పార్టీలో ఇప్పుడు లుకలుకలు మొదలయ్యాయి. అధినేత్రి ఆదేశాలను కూడా గెలిచిన ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు. దీంతో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీలో ఉత్పన్నమైన అసంతృప్తి, నాయకుల వలసలు, సంస్థాగత బలహీనతలు మమతా ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాయి. ఇటీవల ఎన్నికల తర్వాత టీఎంసీ ఆహ్వానించిన ధర్నా కార్యక్రమం పార్టీ బలహీనతను బహిర్గతం చేసింది. మొత్తం ఎమ్మెల్యేలలో కేవలం 40 శాతం మంది మాత్రమే పాల్గొనడం ద్వారా పార్టీలోని వ్యతిరేకత స్పష్టమైంది. తర్వాతి ఎమ్మెల్యేల సమావేశాల్లో హాజరు ఇంకా తగ్గి, 25వ తేదీ నాటికి 40 మందికిపైగా గైర్హాజరు అయ్యారు. హాజరైన ఎమ్మెల్యేలు పార్టీ నిర్వహణను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫాల్టా నియోజకవర్గం (అభిషేక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని) అభ్యర్థి జహంగీర్ ఖాన్ విషయంలో తీసుకున్న నిర్ణయం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇది పార్టీలో కుటుంబ ప్రాధాన్యతపై ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబిస్తుంది.పార్టీ సంక్షోభం అసెంబ్లీ స్థాయిలో మాత్రమే కాకుండా స్థానిక సంస్థల వరకు వ్యాపించింది. ఎన్నికలు ముగిసిన వెంటనే ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడగా, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బయటకు వస్తున్నారు. ఈ వలసలు టీఎంసీ గ్రాస్‌రూట్ స్థాయి బలాన్ని బలహీనపరుస్తున్నాయి. ఆసక్తికరంగా, బీజేపీ ఈ రకమైన టీఎంసీ నాయకులను చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదని సంకేతాలు వస్తున్నాయి. దీని వల్ల బయటకు వచ్చిన నాయకులు భవిష్యత్తు ఒంటరిగా మారే?ప్రమాదం ఉంది.టీఎంసీ ప్రధాన కార్యాలయం అద్దె భవనంలో ఉండటం, యజమాని ఖాళీ చేయమని నోటీసు ఇవ్వడం పార్టీ స్థితిని సంకేతిస్తోంది. సమావేశాలు నిర్వహించడానికి కూడా తగిన మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే మరో కీలక పరిణామం: భారాసాత్ ఎంపీ భారాసాత్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం. ఇలాంటి రాజీనామాలు పార్టీలోని ఉన్నత స్థాయి అసంతృప్తిని తెలియజేస్తాయి. మమత ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో నిస్సహాయతకు గురవుతున్నారని అంచనా వేస్తున్నారు.బెంగాల్‌లో కమ్యూనిస్టు శక్తులు ఇప్పటికీ కొంత పట్టు కలిగి ఉన్నాయి. అయితే రాబోయే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో చెప్పడం కష్టం. టీఎంసీలోని ప్రస్తుత సంక్షోభం కొనసాగితే, మమతా నాయకత్వం బలహీన కూడా మనుగడ సాగించడం కష్టమే అనిపిస్తోంది. మమతా బెనర్జీ రాజకీయ ప్రయాణం ఎప్పుడూ సవాళ్లతో నిండి ఉంది. కానీ ఈసారి సవాళ్లు పార్టీ లోపలి నుంచి వస్తున్నాయి. అంతర్గత ఐక్యతను పునరుద్ధరించకపోతే, దశాబ్దాల పాలన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ వేగంగా క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వినూత్న నిర్ణయాలతో విజయ్...

**చెన్నై, (భారత శక్తి)** విజయ్ సినిమాలు విడుదలయితే తమిళనాడులో సరికొత్త రికార్డులు నమోదవుతాయి. బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త వసూళ్లు సాధ్యమవుతాయి. కానీ, రీల్ లైఫ్ నుంచి రియల్ లైఫ్ కి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రిగా మారిపోయిన తర్వాత విజయ్ తన స్టైల్ పూర్తిగా చేంజ్ చేసుకున్నారు. మేకోవర్ నుంచి మొదలు పెడితే పాలిటిక్స్ వరకు అన్నిట్లో గేమ్ చేంజింగ్ పర్సన్ అయిపోయారు.తమిళనాడులో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు విజయ్ ని మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి. విజయ్ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా కోయంబత్తూరు బాలిక ఘటనలో విజయ్ స్పందించిన తీరు యావత్ దేశాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. క్షణాల్లో విజయ్ తీసుకున్న నిర్ణయం బాలిక కుటుంబానికి న్యాయం చేసింది. అంతేకాదు ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు జైలు పాలయ్యేలా చేసింది.. ఇలా చెప్పుకుంటూ పోతే విజయ్ చేస్తున్న పరిపాలన.. తీసుకుంటున్న నిర్ణయాలు అచ్చం సినిమాల మాదిరిగానే ఉన్నాయి.తాజాగా విజయ్ తన రాష్ట్ర రైతులకు శుభవార్త చెప్పారు.. వారందరి సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన 50 వేల వరకు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సాకార బ్యాంకులో గత ఏడాది మే 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు రుణాలు తీసుకున్న వారందరికీ ఇది వర్తిస్తుందని విజయ్ స్పష్టం చేశారు.ఇంతటితోనే విజయ్ ఆగిపోలేదు. లక్ష రూపాయలు, అంతకు పైన రుణాలను ఐదు విభాగాలుగా విభజించి.. 20000, 15000, 10000, 5000 చొప్పున రుణాలను మాఫీ చేస్తున్నట్టు విజయ్ ప్రకటించారు. తద్వారా రైతుల మీద ఉన్న రుణ భారాన్ని తగ్గిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. తమిళనాడు రైతులకు విజయ్ తీసుకున్న నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది. అంతేకాదు వారికి వ్యవసాయంలో మెరుగైన ఉత్పత్తి సాధించడానికి.. దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఇటీవల డిఎంకె అధినేత స్టాలిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయ్ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగా.. నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అయితే వీటిపై విజయ్ ఇంతవరకు స్పందించలేదు. కేవలం తన చేతల ద్వారా మాత్రమే స్టాలిన్ వ్యాఖ్యలకు సమాధానం చెబుతున్నారు. అన్నట్టుగానే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తద్వారా తాను మాటల ముఖ్యమంత్రిని కాదని.. చేతల ముఖ్యమంత్రినని నిరూపించుకుంటున్నారు విజయ్.

# పెద్ది ప్రాబ్లమ్ సాల్వ్‌డ్..

**హైదరాబాద్,(భారత శక్తి)** కొంతకాలం గా టాలీవుడ్ లో జరుగుతున్న వివాదాన్ని మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. ఎక్సిభిటర్స్ మాకు కమీషన్ బేసిస్ మీద సినిమాలను రన్ చేసుకునే అవకాశం ఇవ్వాలని , అది 'పెద్ది' నుండే మొదలు అవ్వాలని పెద్ద ఎత్తున హల్చల్ చేశారు. కానీ నిర్మాతలు అందుకు ఒప్పుకోలేదు. 'పెద్ది' విషయం లో ఇప్పటి వరకు విధానం ఆలోచించే అవకాశం రాలేదని , చర్చల ద్వారా , కొన్ని కండీషన్స్ ని వాళ్ళు ఒప్పుకుంటూనే మేము కమీషన్ బేసిస్ మీద ఈ చిత్రాన్ని రన్ చేయడానికి ఒప్పుకుంటామని నిర్మాతలు తేల్చి చెప్పారు. దీనిపై కొన్ని రోజులు వివాదం నడుస్తూనే ఉన్నింది. అయితే రీసెంట్ గానే ఎక్సిభిటర్లు మెగాస్టార్ చిరంజీవి ని కలవడం , అదే విధంగా నిర్మాతలు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలవడం తో ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరికింది.'పెద్ది' చిత్రాన్ని రెంటల్ బేసిస్ మీద నడిపేందుకు ఎక్సిభిటర్లు ఒప్పుకున్నారు. కానీ ఒకవేళ తెలంగాణ లో టికెట్ రేట్స్ హైక్స్ కి ప్రభుత్వం అనుమతిస్తే , అందులో నుండి వచ్చే కలెక్షన్స్ లో 7.5 వాటా మాకు ఇవ్వాలని ఎక్సిభిటర్లు షరత్తు పెట్టడం , అందుకు నిర్మాతలు కూడా ఒప్పుకోవడం తో , వివాదం ఇక్కడితో ముగిసింది. దీంతో జూన్ 4 న తెలంగాణ లో ఒకవేళ టికెట్ రేట్స్ పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తే , ఈ చిత్రం కమీషన్ బేసిస్ మీదనే రన్ అయ్యే అవకాశాలు ఉంటాయి. లేదంటే రెంటల్ బేసిస్ మీదనే రన్ అవుతాయి. దిల్ రాజు బృందం కూడా 7.5 శాతం కమీషన్ కి ఒప్పుకోవడం , ఎలాగో దిల్ రాజు ప్రభుత్వం లో ఉన్నాడు కాబట్టి , టికెట్ హైక్స్ కి ఎలాంటి అడ్డంకి పెట్టే అవకాశం లేకపోవడం తో , కచ్చితంగా ఈ చిత్రానికి టికెట్ హైక్స్ వస్తుందని అంటున్నారు విశ్లేషకులు.దీంతో ప్రస్తుతానికి 'పెద్ది' ముందు ఉన్నటువంటి చిక్కుముడులు తెరపడినట్టే అయ్యింది. మరి రాబోయే రోజుల్లో ఇంకా ఏమైనా ట్విస్టులు రాబోతున్నాయా లేదా అనేది చూడాలి. ఇకపోతే ఈ సినిమాకు జూన్ 3 న ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ప్రీమియర్ షోస్ ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రీమియర్ షోస్ టికెట్ రేట్స్ 600 రూపాయిల వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ లో ఈ ప్రీమియర్ షోస్ తో పాటుగా, రోజుకి 5 షోస్ ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వనుంది కూటమి సర్కార్. ఇక మొదటి రోజు ఓపెనింగ్ వసూళ్లు ఏ రేంజ్ లో ఉండబోతున్నాయి చూడాలి.

## టీడీపీకి గేమ్ ఛేంజర్ కానున్న

# మహిళా రిజర్వేషన్

**విజయవాడ,(భారత శక్తి)** మహానాడు వేదికగా టీడీపీ చరిత్రాత్మక ప్రకటన చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండానే.. మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మహానాడులో తీర్మానం చేశారు. ఈ ఒక్క ప్రకటన.. ఏపీ రాజకీయాన్ని ఎలా మార్చబోతోంది. విపక్షాలకు ఒక రకంగా ఇది టీడీపీ విసిరిన సవాల్ అనుకోవచ్చా.. ఇప్పుడు వైసీపీ స్టాండ్ ఎలా ఉండే అవకాశం ఉంది..మహానాడు మొదటిరోజే చరిత్రలో నిలిచే పోయే సంఘటన కనిపించింది. గతానికి భిన్నంగా హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. పూర్తిగా డిజిటల్ వేదికపై మీటింగ్స్ నిర్వహిస్తోంది. స్త్రీశక్తి అనే థీమ్‌తో ఈసారి మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. మహిళా సాధికారత, యువత పాత్ర, సామాజిక సమతుల్యత లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలను రూపొందించింది. ఐతే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదిక నుంచి నారా లోకేష్.. భారీ అనౌన్స్‌మెంట్ చేశారు. మహిళల కోసం టీడీపీ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా.. భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వ్ చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఇదే ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్ అవుతోంది.ఎన్నికల టైమ్‌లో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయని.. ఐతే ఎలక్షన్స్ తర్వాత మహిళలను మర్చిపోతాయని.. టీడీపీ విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అన్నారు లోకేశ్. మహిళల విషయంలో గతంలో టీడీపీ చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా విద్యా సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడంతో టీడీపీ మరో ముందడుగు వేసింది. టీడీపీ నిర్ణయం అమల్లోకి వస్తే.. పొలిటికల్‌గా గేమ్‌ఛేంజర్‌గా మారే అవకాశాలు క్లియర్‌గా కనిపిస్తున్నాయ్. నెక్స్ట్ ఎన్నికల్లో సైకిల్ పార్టీకి అతి పెద్ద ఆయుధంగా మారే అవకాశం ఉంటుంది. ఐతే అటు టీడీపీ ఒక్క స్టేట్‌మెంట్‌తో.. విపక్షాలకు సవాల్ విసిరినట్లు కూడా అయింది. ఇది రాజకీయాన్ని మలుపు తిప్పే అవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది.రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండా.. మహిళలకు 33శాతం సీట్లు ఇస్తే మాత్రం.. దేశ రాజకీయాల్లోనే టీడీపీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. ప్రకటనల సంగతి ఎలా ఉన్నా.. జాతీయ స్థాయిలో ఏ పార్టీ కూడా మహిళలకు కచ్చితంగా 33శాతం టికెట్లు ఇవ్వడం లేదు. చాలా పార్టీలు 10 నుంచి 18శాతం మాత్రమే ఇస్తున్నాయ్. ఇదంతా ఎలా ఉన్నా.. ఇప్పుడు టీడీపీ చేసిన ప్రకటన వైసీపీని టార్గెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయ్. మహిళలకు సీట్ల కేటాయింపు విషయంలో ఆ పార్టీలు ఇదే దారిలో ప్రయాణించాల్సి ఉంటుంది. వాళ్లు కూడా 33శాతం సీట్ల కేటాయింపునకు ఫిక్స్ కావాల్సి ఉంటుంది. . చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు కల్పించే వీలుగా ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. మూడింట రెండు వంతు మెజారిటీ లేక వీగిపోయింది ఈ బిల్లు. అయితే ఈ బిల్లు ఇప్పుడు మరోసారి పార్లమెంట్లో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ ఈ మహిళా బిల్లు పై గట్టిగానే మాట్లాడుతున్నారు. జాతీయస్థాయిలో మిగతా రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తరుణంలో మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై సంచలన నిర్ణయం తీసుకుంది తెలుగుదేశం పార్టీ. బిల్లు ఆమోదంతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33 శాతం మహిళలకు టిక్కెట్లు ఇస్తామని ప్రకటించింది తెలుగుదేశం.స్త్రీ శక్తి థీమ్ తో సాగిన మహానాడు లో అదే మహిళలకు సంబంధించి కీలక ప్రకటన చేశారు నారా లోకేష్. పార్లమెంటులో బిల్లుతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33% మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. అంటే వచ్చే ఎన్నికల్లో దాదాపు 50 మంది మహిళా ఎమ్మెల్యేలు సభకు రానున్నారు అన్నమాట. ఇప్పటికే నాయకులు తమ మహిళా వారసులను రంగంలోకి దించారు. పార్టీతో పాటు పాలనలో భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఇప్పుడు మహానాడు వేదికగా యువరాజు లోకేష్ ప్రకటనతో సీనియర్ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహానాడు వేదికపై పెద్ద చర్చ నడిచింది. అయితే చాలామంది నేతలు కుమార్తెలు లేకపోవడంతో కోడళ్లను రంగంలోకి దించేందుకు అక్కడి నుంచే ప్రణాళిక మొదలుపెట్టారు. మొత్తానికైతే మహానాడు వేదికగా తొలి రోజు ఒక సంచలన నిర్ణయం వెలువడటం నిజంగా గొప్ప విషయమే.దీంతో రాజకీయ సమీకరణాలే మారిపోతాయ్. టీడీపీ చేసిన ఒక్క ప్రకటన.. ఆ పార్టీ విధానాలకు అనౌన్స్‌మెంట్‌లా మాత్రమే కాదు.. రాజకీయాన్ని మార్చబోయే అస్త్రంగా కనిపిస్తోంది. మిగతా పార్టీల రియాక్షన్ ఎలా ఉంటుంది.. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి

# షర్మిళకు రాజ్యసభ..

**కడప, (భారత శక్తి)** దేశవ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికల సందడి కనిపిస్తోంది. పది రాష్ట్రాల నుంచి 24 మంది ఎంపీలు పదవీ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపికకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ నుంచి నలుగురు సభ్యులు పదవీ విరమణ చేయనుండగా.. ఆ పదవులన్నీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. మరోవైపు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు సైతం రాజ్యసభ పదవి ఖాయమని ప్రచారం నడుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్ వైపునకు తిప్పేందుకు షర్మిల కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ప్రధానంగా ఆమెను కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎంపిక చేస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతానికి ఆమెకు సానుకూలమైన వాతావరణం ఉన్నట్లు తెలుస్తోంది.కర్ణాటక నుంచి ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ మూడు పదవులు కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం పదవీ విరమణ చేయనున్నారు. అయితే కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆశిస్తున్నారు. అయితే సిద్ధరామయ్య వర్గం దానిని అడ్డుకుంటోంది. మద్యేమార్గంగా మల్లికార్జున్ ఖర్గేకు ముఖ్యమంత్రి పదవి అప్పగించి.. రాజ్యసభకు సిద్ధరామయ్యకు పంపిస్తారని తెలుస్తోంది. మరో రెండు రాజ్యసభ పదవుల్లో ఒకటి షర్మిల కు ఖాయం చేసినట్లు పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది. అటు డీకే శివకుమార్ వర్గం సైతం షర్మిలకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది.తన తండ్రి పేరుతో తెలంగాణలో పార్టీని ఏర్పాటు చేశారు షర్మిల. కానీ పెద్దగా వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. విలీన సమయంలోనే షర్మిలకు గట్టి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తరుపున రాజ్యసభ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఇప్పుడు దాని ప్రకారం కర్ణాటక నుంచి షర్మిలను ప్రమోట్ చేస్తారని తెలుస్తోంది. ఈ విషయంలో రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులను మరింతగా ఆకర్షించవచ్చన్నది కాంగ్రెస్ ఆలోచన. వచ్చే ఎన్నికల నాటికి ఏపీలో సైతం ఓట్ల పరంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే.. షర్మిల నాయకత్వాన్ని మరింత పెంచాలని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్

**విశాఖపట్టణం,(భారత శక్తి)** విశాఖపట్నంలో డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌కు సంబంధించి కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ కేంద్రానికి కీలక ప్రతిపాదన చేసింది.

విశాఖపట్నంలో డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్ 20 కిలోమీటర్లు కాకుండా 13 కిలోమీటర్లు సరిపోతుందని కేంద్రానికి తెలిపింది. వాస్తవానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ 20 కిలోమీటర్లకు ప్రతిపాదనలు పంపింది.. కానీ 13 కిలోమీటర్లు సరిపోతుందని రైట్స్ చెబుతోంది.విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌కు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం దగ్గర ఉన్నాయి. మొత్తం 20 కిలోమీటర్లు మేరు డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌ను ప్రతిపాదించగా.. ఈ అంశంపై సర్వే చేసిన రైట్స్ కన్సల్టెన్సీ మాత్రం 13 కిలోమీటర్లు చాలని కేంద్రానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్ గాజువాక నుంచి హనుమంతవాక వరకు సరిపోతుందని కేంద్రానికి రైట్స్ కన్సల్టెన్సీ సూచించినట్లు సమాచారం. విశాఖపట్నంలో ఏకంగా 140.13 కిలోమీటర్లు మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రతిపాదించారు.

ముందుగా మొదటి దశలో 46.23 కిలోమీటర్ల పొడవున రూ.11,498 కోట్లతో ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు చేశారు.ఇంతలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నగరం మధ్యలోని నేషనల్ హైవే దగ్గర ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ నిర్మిస్తామని తెలిపింది. లంకెలపాలెం నుంచి మధురవాడ వరకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో మెట్రో రైలు ప్రాజెక్టులో డబుల్ డెక్కర్ కారిడార్ ప్రతిపాదన వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ 20 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ మెట్రో డబుల్ డెక్కర్ కారిడార్‌ను స్టీల్‌ప్లాంట్ నుంచి గాజువాక వరకు 5 కిలోమీటర్లు.. తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకు 15 కిలోమీటర్లు ప్లాన్ చేశారు. నేషనల్ హైవే మధ్యలో మెట్రో కారిడార్ స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు నిర్మించాలని భావించారు.ఈ ప్రతిపాదనతో భూసేకరణ అవసరం ఉండదని ఇలా డిజైన్ చేశారు. అలాగే మెట్రో ప్రాజెక్టు వ్యయం కూడా తగ్గుతుందన్నది భావించారు. మెట్రో కారిడార్ ఎన్‌హెచ్ఏఐ నిర్మిస్తామన్న ఫ్లైఓవర్‌పై వచ్చేలా డిజైన్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ కేంద్రానికి ఈ ప్రతిపాదనలకు సంబంధించిన డీపీఆర్‌ను పంపింది. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి.. ఈ క్రమంలో నగర ప్రజలు మెట్రో రైల్ వస్తే బావుంటుందని ఎదురు చూస్తున్నారు. ఇంతలో డబుల్ డెక్కర్ ప్రతిపాదనల్ని కుదించాలని రైట్స్ సంస్థ కేంద్రానికి సిఫార్సు చేయడం చర్చనీయాంశమైంది. 20 కిలో మీటర్లకు ప్రతిపాదిస్తే 13 కిలోమీటర్లకు కుదించడం దారుణమన్నారు.

# కొత్త విమానశ్రయాలకు రెడీ

**కాకినాడ,(భారత శక్తి)** ఏపీలో కొత్తగా ఎయిర్‌పోర్ట్‌లకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చిన సంగతి తెలిసిందే. కాకినాడ జిల్లాలో కూడా కొత్తగా ఎయిర్‌పోర్ట్‌ను ప్లాన్ చేయగా.. తుని-అన్నవరం మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించారు. తాజాగా విమానాశ్రయం సాధ్యతపై ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నివేదిక కోరింది. దీంతో కాకినాడ జిల్లా అధికారులు త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎయిర్‌పోర్ట్ అంశంపై సమగ్ర సమాచారంతో ఓ నివేదికను సిద్ధం చేసి పంపించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా ఏడు ఎయిర్‌పోర్ట్‌లను ప్లాన్ చేసింది. ఇప్పటికే ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపించగా.. ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. ఈ ఏడు విమానాశ్రయాల్లో కాకినాడ జిల్లాలో ప్లాన్ చేసిన ఎయిర్‌పోర్ట్ భూముల కేటాయింపునకు సంబంధించి కాస్త గందరగోళం ఏర్పడింది.

తుని-అన్నవరం మధ్య ఏర్పాటు చేయాలని భావించారు.. ఆ తర్వాత పాయకరావుపేట తుని మధ్యలో అంటూ ప్రచారం జరిగింది. అయితే మళ్లీ తుని-అన్నవరం మధ్య ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాజాగా ఈ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి అప్డేట్ వచ్చింది.ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కీలక ఆదేశాలు ఇచ్చింది. తుని-అన్నవరం మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారుల్ని కోరింది. భూసేకరణకు సంబంధించి వివరాలు అడిగారు. ప్రభుత్వ భూముల లభ్యత, ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదించిన చోటి నుంచి రోడ్డు ఎంత దూరంలో ఉంది. నీళ్లు, విద్యుత్ సహా మిగిలిన సౌకర్యాలు ఉన్నాయా.. భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డులు వంటి అంశాలపై నివేదిక కోరారు.

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా అధికారులు త్వరలోనే రంగంలోకి దిగి వివరాలు సేకరించి నివేదికను అందించనున్నారు.కాకినాడ జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన వచ్చిన సమయంలో తుని-అన్నవరం మధ్య తొండంగి మండలం బెండపూడి, పీఈ చిన్నాయిపాలెం మధ్య ప్లాన్ చేశారు. కొత్త విమానాశ్రయానికి అవసరమైన భూమిని కూడా గుర్తించారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రాథమికంగా ఓ నివేదికను అందజేశారు. కోల్‌తా-చెన్నై నేషనల్ హైవే 16కు ఆనుకుని, అన్నవరం రైల్వేస్టేషన్‌కు మూడు కిలోమీటర్ల సమీపంలో స్థలాన్ని గుర్తించారు. 2024లో అప్పటి కాకినాడ జిల్లా కలెక్టర్ పీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నివేదికను అందజేశారు.. ఆ తర్వాత మళ్లీ ఈ కొత్త ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనలపై క్లారిటీ రాలేదు.. తాజాగా మరోసారి వివరాలు కోరారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఎయిర్ కార్గో ద్వారా కాకినాడ పోర్టు నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కంపెనీల నుంచి ఎగుమతులు చేయొచ్చంటున్నారు.

## హనుమంత వాహనంపై

# శ్రీ గోవిందరాజస్వామి దివ్య విహారం

- భక్తులకు అభయప్రదానం చేసిన గోవిందుడు
- చెక్కభజనలు, కోలాటాలతో మారుమోగిన తిరుపతి వీధులు
- బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం

**(భారత శక్తి)** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన గురువారం ఉదయం 7 గంటలకు శ్రీ గోవిందరాజస్వామివారు హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు.భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని పరవశించారు.త్రేతాయుగంలో శ్రీరాముడికి పరమభక్తుడిగా వెలుగొందిన హనుమంతుడు భక్తి, శక్తి, శరణాగతికి ప్రతీకగా నిలిచాడు. బుద్ధి, బలం, ధైర్యం, ఆరోగ్యం, నిర్భయత్వం, వాక్పటిమ హనుమత్స్మరణతో సిద్ధిస్తాయని పురాణాలు వివరిస్తున్నాయి. అందుకే స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు శరణాగతి మహిమను చాటిచెప్పారు.అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు.

# జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో వెలియనున్న ప్రపంచ రికార్డు నంది

**- విద్యాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి**



**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 28:** సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతిపెద్ద నందీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఆశ్రమంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. 30 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పు, 19 అడుగుల ఎత్తులో నందీశ్వర విగ్రహాన్ని తయారు చేయిస్తామని చెప్పారు. రాయి బరువు 684 టన్నులు ఉంటుందన్నారు. విగ్రహం కు సంబంధించిన రాయి కంది మండలం ఎర్ధనూర్ శివారులోని కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో లభ్యమైనట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయం లో ఉన్న నంది ప్రస్తుతం అతిపెద్ద విగ్రహం అని చెప్పారు. ఆశ్రమంలో త్వరలో ఏర్పాటుచేసే నంది విగ్రహం దానికంటే ఎత్తు బరువు ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో భారీ వాహనంలో ఊరేగింపుగా ఆశ్రమానికి తీసుకువస్తామని తెలిపారు. విద్యాపీఠం మీడియా ఇన్చార్జి తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అతిపెద్ద నందీశ్వర విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇందులో తాను కూడా భాగస్వామిని కావడం పూర్వజన్మ అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం నందీశ్వర ప్రతిమను ఆవిష్కరించారు. సమావేశంలో సభ్యులు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం.

**- ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లిలో రైతు మృతి.**



భారత శక్తి, రాజన్న సిరిసిల్ల,మే 28:ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లిలో పొలంలో వరి కొయ్యలకు రైతు నారాయణ (60)నిప్పు పెట్టడం తో తీవ్రమైన ఎండల కారణంగా ఒక్కసారిగా ఎగిసిపడిన మంటలు, దట్టమైన పొగలో చిక్కుకుని ఊపిరాడక రైతు మృతి చెందాడు. నిబంధనలు బేఖాతరు చేస్తూ వరి కొయ్యలను తగులబెట్టవద్దని, భూసారంతో పాటు పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న పంట వ్యర్థాల దహనం పై అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, నిప్పు పెట్టవద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎల్లమ్మ జాతరలో మద్యం మత్తులో వాహనాలు నడిపితే వేటు..

**- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, తాగి బండి నడుపుతే సీజే..!**




**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 28:** ఇల్లంతకుంట మండలం కందికట్కూరు ఎల్లమ్మ జాతర సందర్భంగా నిర్వహించే బండ్ల ఊరేగింపులో ఎవరైనా డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ హెచ్చరించారు. జాతరలో భక్తుల భద్రతే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఉత్సవాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను నడిపే డ్రైవర్లు, ఓనర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జాతర పరిసరాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడమే కాకుండా, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. భక్తులంతా సహకరించి, జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించండి

**- బక్రీద్ వేళ సిరిసిల్లలో ముస్లింల వినూత్న డిమాండ్**



భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, మే 28: జిల్లా కేంద్రంలో ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలు వినూత్నంగా నిరసన తెలిపారు. సిరిసిల్లలోని ఈద్గాలో శాంతియుత వాతావరణంలో ప్రార్థనలు పూర్తి చేసుకున్న అనంతరం వారు ప్లకార్డులతో ఈ డిమాండ్ ను వినిపించారు. దేశంలో ఆవుల పేరుతో జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎవరూ ఆవులను బలి ఇవ్వవద్దని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. జాతీయ పక్షిగా నెమలికి ఉన్న గౌరవం మరియు హోదా ఆవుకు కూడా కల్పించాలని, ఆవును జాతీయ జంతువుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని వారు కోరారు. మత సామరస్యానికి ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**- ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోంది**

**- ముందస్తు పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు - యశోద గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ పోలవరపు నవీన్**



**సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 28 :**ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన ప్రముఖ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్ పోలవరపు పేర్కొన్నారు.ఈరోజు సంగారెడ్డి లో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్‌లు, అధిక మద్యపానం వంటి కారణాలతో లివర్ దెబ్బతింటోందన్నారు. లివర్ డ్యామేజ్‌ను "సైలెంట్ కిల్లర్"గా అభివర్ణిస్తూ, కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు బయటపడే వరకు చాలా మందికి వ్యాధి ఉన్న విషయం తెలియదన్నారు. అప్పటికే వ్యాధి ముదిరిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. హెపటైటిస్ బి, సి వైరస్‌లు చాలామందికి తెలియకుండానే శరీరంలో ఉండి క్రమేపీ లివర్‌ను దెబ్బతీస్తాయని తెలిపారు. ముందుగానే పరీక్షల ద్వారా గుర్తిస్తే వ్యాక్సినేషన్, చికిత్సలతో ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్ నివారణకు కొలెస్ట్రాల్, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలను కూడా అదుపులో ఉంచుకోవాలని సూచించారు.అధిక మద్యపానం వల్ల ప్యాంక్రియాటైటిస్ వచ్చే ప్రమాదం ఉందని, ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు. మద్యపానం తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చన్నారు.అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. మలవిసర్జనలో మార్పులు, మోషన్‌లో రక్తం పడటం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.కొలనోస్కోపీ ద్వారా పేగుల్లోని పాలిప్స్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తొలగించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. పాశ్చాత్య దేశాల్లో కొలనోస్కోపీ అవగాహన పెరగడంతో పెద్దప్రేగు క్యాన్సర్ కేసులు గణనీయంగా తగ్గాయని వివరించారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ డాక్టర్ నవీన్ పోలవరపు మెడికల్ గ్యాస్ట్రో ఎంటెరాలజిస్ట్ , కార్పోరేట్ రిలేషన్స్ ఆఫీసర్ మహేష్, సంగారెడ్డి అధికారి గోపాల్ పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రజా ప్రభుత్వం

**- అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు: మంత్రి సీతక్క**



**మంగపేట/ములుగు జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి):** తెలంగాణలోని పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం, అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, మంగపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు గురువారం చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఆడబిడ్డల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని, చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాత మాత్రమే వివాహాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని, బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

**- రైతులు అధైర్యపడవద్దు.. తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 28 (భారత శక్తి)** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తడిచిన ధాన్యం విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరంలేదని, తడిచిన వరి ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాల వారిగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హమాలీల, రవాణా సమస్య లేకుండా చూడాలన్నారు.

కలెక్టర్లు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీసీ అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. రోజువారీగా నిర్దేశిత కొనుగోలు లక్ష్యాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల ప్రక్రియ ముగిసే వరకూ ఇదే చొరవతో పని చేయాలి:జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**- జిల్లాలో వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు**

**-తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలి**



**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 28:** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకూ అధికారులు ఇదే చొరవతో పని చేస్తూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం, అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద నుండి అపరల్ పార్క్ కు హమాలీలను తరలించడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వారీగా ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ పై ఆరా తీసి, ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తయ్యేవరకు అధికారులు ఇదే చొరవతో పని చేయాలని, రాబోయే వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**




**సంగారెడ్డి జిల్లా, మే 28(భారత శక్తి న్యూస్):** సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్, వాట్స్ ఆప్, టెలిగ్రాం వంటి సోషల్ మీడియా వేదికగా నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనల ద్వారా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు బ్రాండెడ్ షూస్, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, గ్యాడ్జెట్లు, లగ్జరీ వస్తువులను భారీ డిస్కౌంట్లతో అందిస్తున్నట్లు నకిలీ స్పాన్సర్ యాడ్స్ రూపొందించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బాధితులు ఆన్లైన్ చెల్లింపులు చేసిన తర్వాత వస్తువులు అందకపోవడం మాత్రమే కాకుండా, బాధితుల బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం కూడా ఉందన్నారు. ప్రజలు గుర్తుంచుకోవలసిన విషయాలు అసాధారణ డిస్కౌంట్లు ఫ్లాష్ సేల్, కాష్ ఆన్ డెలివరీ సౌకర్యం లేకపోవడం, కొత్తగా సృష్టించిన సోషల్ మీడియా పేజీలు, అనుమానాస్పద యు.ఆర్.ఎల్, నకిలీ వెబ్‌సైట్లు, తప్పుడు రివ్యూలు, ముందస్తుగా డబ్బు చెల్లించమని ఒత్తిడి చేయడం వంటివి సైబర్ నేరగాళ్ల పన్నిన మోసపూరిత కుట్ర అని గుర్తించాలన్నారు.

**సైబర్ మోసాల బారిన పడకుండా పాటించవలసిన సూచనలు:**
- ఆన్లైన్ పేమెంట్ చేసే ముందు వెబ్‌సైట్, యు.ఆర్.ఎల్, లను జాగ్రత్తగా పరిశీలించాలి.
- పేజీ హిస్టరీ, ఫాలోవర్స్, రివ్యూ లను పరిశీలించాలి.
- తెలియని స్పాన్సర్ యాడ్స్ పై క్లిక్ చేయకూడదు.
- సురక్షిత పేమెంట్ పద్ధతిని మాత్రమే ఉపయోగించాలి
- ఓ.టి.పి లు, బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ పంచుకోకూడదు.

ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, నకిలీ ప్రకటనలు మరియు మోసపూరిత వెబ్‌సైట్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసిగాని, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ cybercrime.gov.in లో గాని ఫిర్యాదు నమోదు చేయాలి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy